₹40

జనవరి - 2025

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 34 • సంచిక : 4

JANUARY - 2025



Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA

Oxford
Grammar High School

OGS JUNIORS grow naturally

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE



# We make school time the **best time** for your kids

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- **Loving atmosphere & play ground**
- **CCTV surveillance**
- **Certified teachers & caring staff**
- **Kids zone & play area**
- **Interactive & Value based Learning**

**CARING TEACHERS & STAFF**
Your child will get the best care and attention

**ECO-FRIENDLY PRACTICES**
We let the children play with nature friendly material

**HUGE PLAYGROUND**
Your child will get lots of fresh air and playtime



**INTERACTIVE LEARNING**
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

బాలచెలిమి
పిల్లల వికాస పత్రిక
BALA CHELIMI
Telugu Children's Monthly Magazine

సంపుటి: Volume: 34 | సంచిక : Issue : 4 | హైదరాబాద్ Hyderabad | జనవరి January | పేజీలు Pages 52 | రూ. ₹. 40


లోపలి పేజీల్లో.......




| | | |
|---|---|---|
| కొత్త సంవత్సరంలోకి | మణికొండ వేదకుమార్ | 5 |
| 20వ శతాబ్దాన్ని కనిపెట్టిన శాస్త్రవేత్త టెస్లా (సైంటిస్ట్) | జుగాష్విలి | 6 |
| పది కనులు (బ్రెయిలీ దినోత్సవం) | డా. నీరజ అమరవాది | 7 |
| వేమన పద్యాలు | | 8 |
| సితార దేవి | షీరోస్-256 | 9 |
| సాధారణంగా తెలుగులో చేసే తప్పులు (అక్షరం) | వై. మల్లికార్జున రావు | 10 |
| శాస్త్రవేత్త | లీలాకృష్ణ | 10 |
| బల్లి పాటు (కథ) | ఐతా చంద్రయ్య | 11 |
| ది ఘోస్ట్ ఆఫ్ సెవెన్ సీస్ (కథ) | అర్ణబ్ | 12 |
| సొర చేప (కథ) | లియో టాల్ స్టాయ్ | 13 |
| గాలిపటాలు (ఆట) | చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు | 14 |
| బంగారం - డబ్బు.... | గోపాలం కె బి | 15 |
| భారతీయ మహిళా శాస్త్రవేత్తల విజయ గాథలు (సైన్స్ వెన్నెల-3) | డా నాగసూరి వేణుగోపాల్ | 18 |
| తెలంగాణ - చారిత్రక పర్యాటకం (యాత్ర) | దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి | 19 |
| పిల్లలం మర్రిపిల్లలం (పాట) | గుర్రాల లక్ష్మారెడ్డి | 20 |
| చింత గింజ చిన్నది (పాట) | గంగదేవు యాదయ్య | 20 |
| గోటీలాట (కథ) | గరిపెల్లి అశోక్ | 21 |
| రేగు చెట్టు (చెట్టు - చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 23 |
| పుస్తకం విజ్ఞాన నేత్రం | దుర్గమ్ భైతి | 25 |
| పందెం (కార్టూన్) | శ్రీనివాస్ | 26 |
| నలుగురికి ఖేల్ రత్న... దీప్తి జీవాంజీకి అర్జున (స్పోర్ట్స్) | సచిన్ కోత్వాల్ | 27 |
| హేమంతపు కాంతి సంక్రాంతి (పండుగ) | డా. అమ్మిన శ్రీనివాసరాజు | 29 |
| మాషా - ఎలుగుబంటి (కథ) | అనిల్ బత్తుల | 31 |

| | | |
|---|---|---|
| బ్రాహ్మణుడి భార్య – ముంగిసల కథ | పంచతంత్ర కథ | 34 |
| నిప్పు (పంచభూతాలు) | బెలగాం భీమేశ్వరరావు | 34 |
| షీరోస్ పుస్తకావిష్కరణ | బాలచెలిమి డెస్క్ | 35 |
| స్కూళ్లలో కోడింగ్‌ను ఎందుకు ప్రవేశపెట్టారు? (కంప్యూటర్ నైపుణ్యం)) | | 36 |
| మంచి స్నేహం (కథ) | ఎం. ఠాగూర్ | 37 |
| మాతృమూర్తి మేలి మాటలు (కవిత) | గద్వాల సోమన్న | 38 |
| చెలిమి క్లబ్ | బాలచెలిమి | 38 |
| సముద్రం – నూనె బుడుగు (కథ) | డా. కందేపి రాణీప్రసాద్ | 39 |
| మన జెండా | డా. నమిలకొండ సునీత | 40 |
| బట్టతల డేగ (పక్షి) | సచిన్ కోత్వాల్ | 41 |
| నేర్చుకుందామా | | 42 |
| కలం–చెలిమి | | 42 |
| భలే శిష్యుడు (కథ) | సంగనభట్ల చిన్న రామకిష్టయ్య | 43 |
| భారతదేశంలోని 43 యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలు (జి.కె.) | సచిన్ కోత్వాల్ | 45 |
| బాల చెలిమి గ్రంథాలయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఓ వరం.. (గ్రంథాలయం) | సి కిరణ్ కుమార్ | 46 |
| సమాచారం | బాలచెలిమి డెస్క్ | 47 |
| సి. నారాయణరెడ్డి (వ్యక్తిత్వం) | డా॥ జె. చెన్నయ్య | 50 |

# చెలిమి లేఖలు

నేను గ్రంథాలయంలో సమయం గడపడానికి బాగా ఇష్టపడతాను. మా పాఠశాల గ్రంథాలయంలో వివిధ రకాల పుస్తకాలు ఉన్నాయి. దాంట్లో బాల చెలిమి వారు పంపిన కథలను చదవటానికి ఇష్టపడతాను. నేను కాదు మా స్నేహితులు కూడా గ్రంథాలయానికి వచ్చినప్పుడు బాల చెలిమి వారు పంపిణీ చేసిన పుస్తకాలు చదవడానికి ఇష్టపడతారు. బాల చెలిమి కథలన్నీ నాకు బాగా అర్థమయ్యే విధంగా ఉంటాయి. బాల చెలిమి గ్రంథాలయం వారికి కృతజ్ఞతలు తెలుపుతూ, మరికొన్ని పుస్తకాలను పంపిణీ చేయవలసిందిగా కోరుతున్నాము.

**– యమ్. జ్ఞానేశ్వరి**

9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జల్లేపల్లి

గత నెలలో, బాలచెలిమి మాస పత్రికలో "కలం చెలిమి" అనే శీర్షికలో నా ఫోటో ప్రచురించినందుకు బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ సార్‌కు నా హృదయపూర్వక ధన్యవాదాలు. మా పాఠశాల గ్రంథాలయంలో బాలచెలిమి మాసపత్రిక ఒక ఆకర్షణీయంగా నిలిచింది. ఈ బాలచెలిమి మాసపత్రిక మా పాఠశాల గ్రంథాలయానికి రావడానికి కృషి చేసిన తెలుగు ఉపాధ్యాయులు శివ సార్, గరిపెల్లి అశోక్ సార్‌కు కృతజ్ఞతలు.

**– జి. దుర్గప్రియ**

9వ తరగతి,

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గంభీరావుపేట


*Cover Picture*
***Google***

*బొమ్మలు:*
**కూరెళ్ల శ్రీనివాస్**
m : 98495 43728





**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balachelimi.com
Mob: 98480 44713

# కొత్త సంవత్సరంలోకి...

పిల్లలూ! మీకూ, మీ అమ్మా నాన్నలకూ, మీ టీచర్స్‌కీ నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు. కాలగమనానికి ప్రకృతి గీసిన కొలమానానికి మనం పెట్టుకున్న పేరు సంవత్సరం. ఈ సంవత్సరాలు మన ప్రమేయం లేకుండానే వస్తూపోతుంటాయి. దీనికి గుర్తుగా గోడమీద కేలండర్లు మారుస్తూ ఉంటాం మనం. కానీ కేలండర్‌కి కేలండర్‌కీ మధ్య నడిచే జీవితం మాత్రం మన ప్రమేయంతోనే నడుస్తుంది. ఆ జీవితాన్ని ఆనందంగా ఉంచుకోవడానికి అవసరమైన నాలెడ్జ్‌లో అప్‌డేట్‌గా ఉండటం మన చేతుల్లోనే ఉంటుంది. మరి మనం నూతనంగా అప్‌డేట్‌గా ఉందామా!

మన పండుగల్లో ముఖ్యంగా గ్రామీణ జీవితంలో సంక్రాంతి అతిముఖ్యమైన పండుగ. సంక్రాతి అంటే నూతన కాంతి అని అర్థం. సూర్యుడి చలన సంబంధిత పండుగ. ఈ రోజు నుంచే సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశిస్తాడు. పంటలు చేతికొచ్చి పల్లెలన్నీ పాడిపంటలతో కళకళలాడే ఆనంద సమయం. ఇది డిసెంబర్ 15 నుంచి జనవరి 15 వరకు ధనుర్మాసమంతా ఉత్సాహంగా జరుపుకునే పండుగ. ఈ నెలంతా తెల్లవారు ఝామునే ముంగిళ్ల ముందు ఆవు పేడతో కళ్లాపి చల్లి పెద్ద పెద్ద రంగు రంగుల ముగ్గులు వేసి మధ్యలో గొబ్బెమ్మలు పెట్టి పూలతో అలంకరిస్తారు. తెల్లవారకముందే హరిదాసులు కీర్తనలు, పాటలు పాడుకుంటూ ప్రతి ఇంటికీ వస్తారు. పిల్లలు అతని నెత్తిమీద ఉన్న కలశంలో పెద్ద పాత్ర నిండా వడ్లు తెచ్చి పోస్తారు. కూరగాయలు ఇస్తారు. ఈ పండుగను జనవరి 13న భోగి, 14న సంక్రాంతి, 15న కనుమ పండుగగా మూడు రోజులు జరుపుకుంటారు. పట్టణాల్లో, నగరాల్లో ఉన్న ఉద్యోగస్తులు, వ్యాపారులు ఈ పండుగ కోసం స్వంత ఊర్లకి వస్తారు. భోగి పండుగ నాడు భోగి మంటలు వేస్తారు. జానపద కళాకారులు, గంగిరెద్దు, బుడబుక్కల వాళ్లు, పిట్టలదొరలు ప్రతి పల్లెకు వచ్చి తమ కళాప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తారు. రైతులు లేదనకుండా ప్రతి వారికీ ధనధాన్యాలను దానం చేస్తారు. గ్రామంలోని చేతి వృత్తుల వారికి ధాన్యాన్ని భోగినాడు కానుకగా ఇస్తారు. వారం పది రోజుల ముందు నుంచి ధనిక పేద తేడా లేకుండా తమకున్నంతలో నేతి అరిసెలు, సకినాలు చేసుకుంటారు. సంక్రాంతి నాడు ఇంట్లో అందరూ కొత్త బట్టలతో, పూజలతో బంధుమిత్రులతో సంతోషంగా ఉంటారు. కనుమ రోజున వేట, కోడి మాంసాలతో గారెలతో విందు చేసుకుంటారు. పంట పొలాల్లో పతంగుల పండుగ చేసుకుంటారు. ఈ సంక్రాంతి సంబరాలు చూడాలంటే మీ అమ్మమ్మ వాళ్ళింటికో, నాయనమ్మ వాళ్ళింటికో వెళ్ళాల్సిందే. సంక్రాంతి సెలవుల్ని హాయిగా ఇలా గడిపేయండి.

హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జనవరి 3 నుండి ఫిబ్రవరి 16 వరకు హైదరాబాద్ నుమాయిష్ ఎగ్జిబిషన్ జరుగుతుంది. దీనిలో పిల్లల కోసం ప్లే ఏరియా ఏర్పాటు చేసారు. పిల్లలు ఆడుకోవడానికి, వినోదించడానికి పలు ఏర్పాట్లున్నాయి. జనవరి 31 పిల్లల కోసం కేటాయించారు. వీలున్న వాళ్లు అమ్మానాన్నలతో కలిసి వెళ్లండి. చాలా రద్దీగా ఉంటుంది. అమ్మానాన్నల కనుసన్నల్లోనే ఉంటూ జాగ్రత్తలు పాటిస్తూ ఎంజాయ్ చేయండి.

కొత్త సంవత్సరానికి నూతనత్వాన్నివ్వండి.



వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి



# 20వ శతాబ్దాన్ని కనిపెట్టిన శాస్త్రవేత్త టెస్లా



నికోలా టెస్లా ఒక సెర్బియన్ అమెరికన్ ఆవిష్కర్త. ఎలక్ట్రికల్ ఇంజనీర్, మెకానికల్ ఇంజనీర్, భౌతిక శాస్త్రవేత్త. ఫ్యూచరిస్ట్, ఆధునిక ఆల్టర్నేటింగ్ కరెంట్ (ఎసి) విద్యుత్ సరఫరా వ్యవస్థ రూపకల్పనకు కృషి చేసారు. నికోలా టెస్లా 1856 జూలై 10న ప్రస్తుత క్రొమేషియాలో స్మిల్లన్ గ్రామంలో జన్మించారు. అతని తండ్రి ఆర్థోడాక్స్ చర్చి పూజారి. తల్లి జార్జినా గృహ క్రాఫ్ట్ టూల్స్, మెకానికల్ ఉపకరణాలు తయారు చేయడంలో, సెర్బియా పురాణ పద్యాలను గానం చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నారు. జన్యుపరంగా తల్లి గుణగణాలను సామర్థ్యాలను టెస్లా పొందగలిగారు. జర్మన్, అంక గణితం, మతం గురించి చదువుకున్నారు.

టెస్లా ఆచరణాత్మక కలలు కన్నారు. ఆ కలల సాకారంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తన భౌతిక శాస్త్ర అధ్యాపకుని ప్రేరణతో విద్యుత్ అనే అంశం పట్ల గాఢమైన ఇష్టాన్ని పెంచుకుని ఆ రంగంలో అనేక ప్రయోగాలు చేసాడు. 20వ శతాబ్దాన్ని కనిపెట్టిన వ్యక్తిగా పలువురి ప్రశంసలు పొందాడు. మెదడుకు విద్యుత్‌ను ఉపయోగించడం వల్ల మేధస్సు పెరుగుతుందని టెస్లా సిద్ధాంతీకరించాడు. 1886లో వెస్టింగ్ హౌజ్ ఎలక్ట్రిక్ లైసెన్స్ పొందిన అతని ఎసి ఇండక్షన్ మోటారు మరియు సంబంధిత పాలిఫేస్ పేటెంట్లు అతనికి పెద్ద మొత్తంలో డబ్బును సంపాదించి పెట్టింది. 1884లో యునైటెడ్ స్టేట్స్‌కు వలస వెళ్లారు. అమెరికన్ పౌరసత్వం లభించింది. అనేక చోట్ల ప్రయోగశాలలు ఏర్పాటు చేసుకున్నారు. టెస్లా తన 50వ పుట్టిన రోజున 1906లో 200 హార్స్ పవర్ (150 కిలోవాట్లు) 16000 ఆర్‌పియం బ్లేడ్‌లెస్ టర్బైన్స్‌ను ప్రదర్శించారు.

పేటెంట్ మరియు మార్కెట్ చేయగల ఆవిష్కరణలను అభివృద్ధి చేసే ప్రయత్నంలో టెస్లా మెకానికల్ ఓసిలేటర్లు, జనరేటర్లు, ఎలక్ట్రికల్ డిశ్చార్జి ట్యూబులు మొదటి ఎక్సరే ఇమేజింగ్‌తో అనేక రకాల ప్రయోగాలు చేసారు. హై ఓల్టేజ్, హైఫ్రీక్వెన్సీ పవర్ ప్రయోగాలలో తన ఆలోచనలను ఆవిష్కరించాడు.


టెస్లా సామాజిక, తాత్విక ఆలోచనాపరుడు కూడా. టెస్లా ఆర్థడాక్స్ క్రైస్తవుడిగా పెరిగాడు. మతోన్మాదాన్ని వ్యతిరేకించాడు. బౌద్ధమతాన్ని గౌరవించాడు. 1896 స్వామి వివేకానందునితో పరిచయం కలిగింది.

పదార్థం మరియు శక్తి మధ్య సంబంధాన్ని తాను గణిత శాస్త్రంలో ప్రదర్శించగలనని ఆయనతో చెప్పారు. టెస్లా హిందూ మరియు వేదాంత శాస్త్రాన్ని కొన్ని సంవత్సరాల పాటు అధ్యయనం చేసారు. మనిషి యొక్క గొప్ప విజయం అనే కథనంలో సంస్కృత పదాలు ఆకాశ మరియు ప్రాణాలను అనే పదాలను ఉపయోగించారు. కవులతో, రచయితలతో స్నేహ సంబంధాలతో ఉండేవారు. టెస్లా స్వతహాగా సైన్స్ రచయిత.

టెస్లా దాదాపు 700 పేటెంట్ హక్కులు పొందాడు. కొన్ని పేటెంటులు అందుబాటులో లేవు. 26 దేశాలలో 278 పేటెంట్లు జారీ చేయబడ్డాయి. ఎక్కువగా యునైటెడ్ స్టేట్స్, బ్రిటన్, కెనడాలో ఉన్నాయి. అనేక పేటెంట్స్ ప్రపంచ వ్యాప్తంగా ఆమోదించబడ్డాయి. వైరస్ రంగంలో టెస్లా ఆవిష్కరణలు 20వ శతాబ్దానికి అంకురార్పణ చేసాయి.

– జుగాష్‌విలి
బాలచెలిమి, m : 9848266384






# పది కనులు

పది తలల రావణాసురుడు గురించి విన్నాము. పది కళ్ల గురించి వినలేదంటారా..! అయితే ముందుగా చేతి వేలి చివరలని కన్నులుగా మార్చి, అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన అక్షరశిల్పి లూయిస్ బ్రెయిల్ గురించి తెలుసుకోవాలి.

1809 వ సంవత్సరం జనవరి 4న పారిస్ దగ్గరలోని క్రూవే గ్రామంలో లూయిస్ బ్రెయిల్ జన్మించాడు. ఆ రోజుల్లో దూరాలు వెళ్లడానికి గుర్రాలనే ఎక్కువగా ఉపయోగించే వారు. లూయిస్ బ్రెయిల్ తండ్రి గుర్రాల జీనులు (గుర్రం వీపు పై కూర్చోవడానికి, కాళ్లను పెట్టుకోవడానికి వీలుగా జంతువుల చర్మంతో తయారుచేసే సంచీ లాంటిది) తయారు చేసేవాడు. ఒకరోజు తండ్రి లేని సమయంలో తోళ్లను కోసే కత్తితో బ్రెయిల్ తండ్రిని అనుకరించబోయాడు. అప్పుడు పొరపాటున కత్తి కంటిలో గుచ్చుకున్నది. ఆ కంటికి వైద్యం చేయించినా, కంటి నరాలు బలహీనంగా ఉండడంతో రెండు కళ్ల చూపును కోల్పోయాడు. అలా మూడేళ్ల వయసులో బ్రెయిల్ అంధుడైయ్యాడు.

బ్రెయిలీ తండ్రి చెక్కపై మేకులతో అక్షరాల ఆకారాలను తయారు చేసి కొడుకుకి చదువు నేర్పించాడు. తరువాత బ్రెయిలీ సైనికులు చీకటిలో కూడా సమాచారం పంపే 12 ఉబ్బెత్తు చుక్కల సంకేత లిపి గురించి తెలుసుకున్నాడు. చూపును కోల్పోయినా, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోని లూయిా బ్రెయిల్, ఈ 12 చుక్కలను ఆరు చుక్కలకు తగ్గించి అవసరమైన రీతిలో వాటిని పేర్చుతూ అక్షరాలను, పదాలను, అంకెలను, సంగీత చిహ్నాలను తయారుచేసాడు. అవి అంధులు స్పర్శజ్ఞానంతో చదివేందుకు, రాసేందుకు అనుకూలంగా ఉండడంతో అంధుల పాఠశాలలో బోధనకు ఆమోదం లభించింది. అదే బ్రెయిలీగా పిలవబడుతోంది. ఇది 'టచ్ రీడింగ్' మరియు 'రైటింగ్ సిస్టమ్'. బ్రెయిలీ కనిపెట్టిన అంధులలిపి ప్రస్తుతమున్న కంప్యూటర్ భాషకు వీలుగా రూపొందించబడింది.

"సర్వేంద్రియాణాం నయనం ప్రధానం". కనుచూపు లేని వారి గురించి ఆలోచించిన యునైటెడ్ నేషనల్ జనరల్ అసెంబ్లీ దృష్టిలోపం ఉన్నవారు అందరిలాగే మానవ హక్కులకు, సమానమైన ప్రమాణాలకు అర్హులని తెలియ జేయాలని భావించింది. అంధులకు, దృష్టిలోపం ఉన్నవారికి కమ్యూనికేషన్ సాధనంగా ఉన్న బ్రెయిలీ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జనవరి 4న బ్రెయిలీ దినోత్సవాన్ని జరపాలని నిర్ణయించింది. 2019 నుండి ప్రతి సంవత్సరం జనవరి 4న ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. ఇది దృష్టిలోపమున్న వ్యక్తుల హక్కుల గురించి అవగాహనను పెంచుతుంది. WHO గణాంకాల ప్రకారం 45 మిలియన్ల అంధులున్నారు. వీరిలో కొంత మందివి నివారించతగిన అంధత్వం. వీరి దృష్టిలోపానికి ప్రధానకారణాలు కంటి శుక్లాలు, ట్రకోమా, రివర్ బ్లైండ్ నెస్, పిల్లలలో విటమిన్

ఎ లోపం మరియు ప్రీమెచ్యూరిటీ యొక్క రెటినోపతి వంటి కొన్ని పరిస్థితులు.

ప్రపంచ బ్రెయిలీ దినోత్సవ సందర్భంగా దృష్టిలోపం ఉన్న వ్యక్తులకు స్వేచ్ఛాయుతంగా జీవించడానికి మన వంతుగా అందించాల్సిన సహాయసహకారాల గురించి వివరిస్తుంది. బ్యాంకులు, రెస్టారెంట్లు, ఆసుపత్రులు, సూపర్ మార్కెట్లలో బ్రెయిలీ వర్షన్ కూడా ఉంచాలని, దాని ప్రాధాన్యతని తెలియజేస్తుంది. పాక్షికంగా చూపు ఉన్న, లేదా అంధుడైన వ్యక్తికి బ్రెయిలీ లిపిలో బహుమతి, అభ్యాస సాధనాలు ఇవ్వచ్చని సలహాలు, సూచనలు చేస్తుంది.

శాస్త్రసాంకేతిక అభివృద్ధితో అన్ని రంగాలలో ఎన్నో వినూత్న అవిష్కరణలకు తెర తీస్తున్నాం. అలాగే అంధుల ప్రపంచంలో ఒక నూతన శకానికి ఇప్పుడు తెరతీయబడింది. కిమ్స్ ఫౌండేషన్, పరిశోధన కేంద్రం, డీఆర్ డివో మాజీశాస్త్ర వేత్త డాక్టర్ వి.భుజంగరావు ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కళ్లద్దాలను అందుబాటులోకి తెచ్చారు. అంధులైనవారు వీటిని ధరిస్తే, చేతికర్ర ఊతం, ఇతరుల సాయం లేకుండా వారి పనులు చేసుకోగలరు. ఈ కళ్లద్దాలు దారిచూపడమే కాక, 'టెక్స్ట్ టు స్పీచ్' ఆప్ సాయంతో పుస్తకంలోని అక్షరాలను చదివి వినిపిస్తాయి. యూఎస్ బీ, బ్యాటరీ ఉంటాయి. సెల్‌ఫోన్ లాగా ఛార్జ్ చేసుకోవచ్చు. చిప్ ద్వారా కావలసిన ప్రదేశాలు, ముఖచిత్రాలను సుమారు 400 వరకు నిక్షిప్తం చేసుకోవచ్చు. ఈ కళ్లజోడు తక్కువ బరువుతో అంటే 45 గ్రాములలోనే తయారుచేయబడింది. రాబోయే రోజులలో ఇంకా ఎక్కువ సేవలు అందించడానికి పరిశోధనలు కూడా చేస్తున్నారు.

ఈ సందర్భంగా మనం అవయవదానం, ముఖ్యంగా నేత్రదానం గురించి అవగాహన పెంచుకోవాలి. శరీరంలోని అన్ని అవయవాలు ఆక్సిజన్‌ను రక్తం ద్వారా స్వీకరిస్తాయి. కాని కంటిలోని కార్నియా ఆక్సిజన్ ను నేరుగా గాలి నుంచే తీసుకుంటుంది. అందుకే మరణించాక అన్ని అవయవాలు చలనం కోల్పోయినా, కళ్లు మాత్రం ఆరు గంటల వరకు గాలిలోని ఆక్సిజన్ ను తీసుకుంటూ బతికే ఉంటాయి. ఈ సమయంలో నేత్రదానం చేస్తే ఇద్దరికి చూపునిస్తాయి. నేత్రదానం చేసేందుకు ప్రత్యేక అర్హతలంటూ ఏమీ ఉండవు. ఏడాది వయసు నుండి వందేళ్లు దాటిన వారు కూడా నేత్రదానం చేయవచ్చు.

**"The eyes are the window to your soul"**

**- William Shakespear**

**– డా. నీరజ అమరవాది**
m : 9849160055

శతకం


# వేమన పద్యాలు

**చదువు జదువుకున్న సౌఖ్యంబులును లేవు**
**చదువు చదివె నేని సరసుడగును**
**చదువు మర్మమెరిగి చదువగ చూడుము**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : చదువులేని వారికే సౌఖ్యం లభించదు. చదువుకున్న వాడే సరసుడు. చదువు కోవాలనే ఆశ గలవాడు విద్యలలోని సారాన్ని మర్మాన్ని గ్రహించడానికి చదవాలి గాని వృధా పఠనము వలన ప్రయోజనము లేదు.

**చిత్తశుద్ధిగల్గి చేసిన పుణ్యంబు**
**కొంచెమయిన నదియు గొదువ కాదు**
**విత్తనంబు మఱ్ఱివృక్షంబునకు నెంత**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : మనసు పెట్టి చేస్తే ఏ చిన్న పనైనా సత్ఫలితాలనిస్తుంది. మనసు దాని మీద లేకపోతే అది ఫలించదు. మర్రిచెట్టు విత్తనము ఎంతో చిన్నది అయినా ఎంతో పెద్ద చెట్టయి విస్తరిస్తుంది. దీపం చిన్నదయినా ఎంతో వెలుగునిస్తుంది. కాబట్టి ఏ పనైనా మనసారా చేయమని భావము.



# సితార దేవి

## కథక్ రాణి – ఆకర్షించే కథక్ తీరు, ప్రతి అడుగూ కవితల కాలిబాట

ధనలక్ష్మి (1920 నవంబర్ 8 – 2014 నవంబర్ 25)గా పుట్టిన సితారా దేవి ప్రముఖ కథక్ నర్తకి, గాయని, నటి. ఆమె కోల్‌కతాలో పుట్టారు. తన తండ్రి మార్గదర్శకత్వంలో నాట్య వృత్తిలోకి అడుగుపెట్టారు. సాంఘిక కట్టుబాట్లు ఉన్నప్పటికీ బాల్య వివాహాన్ని ధిక్కరించి చదువుకు, నృత్యానికి ప్రాధాన్యం ఇచ్చారు.

భరతనాట్యం, జానపద నృత్యం, రష్యన్ బ్యాలెలో కూడా ఆమె ప్రావీణ్యం సంపాదించారు. లండన్ రాయల్ ఆల్బర్ట్ హాల్, న్యూయార్క్ కార్నెగీ హాల్తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక వేదికల మీద ప్రదర్శనలు ఇచ్చి అనేక ప్రశంసలు పొందారు. హిందీ చిత్రాలలో తనకంటూ దేవి ఒక ప్రత్యేకత సాధించారు. ఉషా హరన్ నగీనా, రోటీ, వతన్, అంజలి వంటి చిత్రాలకు నృత్య దర్శకత్వం చేశారు. ఆమె బహుముఖ ప్రజ్ఞ ఆమె తీసిన లఘు చిత్రాల ద్వారా వ్యక్తమైంది. కథక్‌పై దృష్టి సారించడానికి ఆమె సినిమాలు వదిలేశారు.

సంగీత నాటక అకాడమీ అవార్డు (1969), పద్మశ్రీ (1973)తో సహా అనేక అవార్డులు దేవి అందుకున్నారు. పద్మభూషణ్ స్వీకరించడానికి ఆమె నిరాకరించి, కళల పట్ల తన నిబద్ధత చాటుకున్నారు, తాను చేసిన కృషికి తగిన గుర్తింపు దక్కాలని కోరుకున్నారు. 2017లో ఆమె 97వ పుట్టిన రోజు సందర్భంగా గూగుల్ ఆమెను గౌరవించింది.

ఆమె కళాత్మక ప్రతిభకు, సామాజిక నిబంధనల పట్ల ధిక్కారానికి, సృజనాత్మక వ్యక్తీకరణలో బహుముఖ ప్రజ్ఞకు, వ్యక్తిగత విషయాల్లో ధైర్యానికి, భవిష్యత్ తరాలకు తన జ్ఞానం అందించాలనే అంకితభావానికి స్ఫూర్తిగా సితారా దేవి జీవితం నిలుస్తుంది.



– **'షీరోస్–256 ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా'** నుండి....

**మీకు తెలుసా?**

పదహారేళ్ల వయసులో ఆమె ఇచ్చిన ప్రదర్శన చూసిన రవీంద్రనాథ్ ఠాగూర్ ఆమెను 'నృత్య సామ్రాజ్ఞి' అని పిలిచారు.




అక్షరం

# సాధారణంగా తెలుగులో చే(రా)సే తప్పులు

'మాట్లాడేసిన మాట వెనక్కి తీసుకోలేం' అంటారు పెద్దలు. అదే విధంగా పరీక్షల్లో, ఉత్తరాల్లో... ఒక్కసారి రాసేసి మరో మనిషికి అందించాక మనకు తెలిసో, తెలీకో చేసిన (రాసిన) తప్పుల్ని సరి చేసుకోలేం కదా. అందుకే రాసేటప్పుడు మెదడు పదాల మీద, భావం మీద, ముఖ్యంగా అక్షరక్షరం మీదా కేంద్రీకరించాలి. అన్నీ బావుండి, కేవలం హడావుడిలో రాయడం వల్లో, నిర్లక్ష్యంగా ఉండడం వల్లో 'సరిగానే' రాసేశామనుకున్న చాలా అక్షరాలు మనకు తెలియకుండానే మరో అక్షరంలా పడిపోతాయి. అవి పదాల్నే మార్చేయొచ్చు లేదా అర్థరహితమైన పదాలకు దారి తీయొచ్చు.

ఆచితూచి రాయండి రాశాక ఒక్క క్షణం సరి చూసుకోండి




**అలాగే, నిర్లక్ష్యంగా రాయకూడని మరికొన్ని అక్షరాలను గమనిద్దాం.**




– వై. మల్లికార్జున రావు

డైరెక్టర్, మహా అకాడెమి, m : 9966961642




## శాస్త్రవేత్త

పలు పనులను చేసే యంత్రాన్ని కనుగొన్నాడని ఆ శాస్త్రవేత్తకు పురస్కారం లభించింది..!


ఆ ఘట్టాన్ని గమనించిన అమ్మ యొక్క కొంగు అమ్మని ఇలా అడిగింది,

"పలు రకాల పనులకు నన్ను ఉపయోగిస్తున్న నువ్వు శాస్త్రవేత్తవి కాదా అని?"

ఆ ప్రశ్న వినగానే వెంటనే కొంగుని దాచేసింది అమ్మ.!

– లీలాకృష్ణ

# బల్లి పాటు




సీతమ్మ ఇంటిలో బల్లి, బొద్దింక స్నేహంగా ఉంటున్నాయి. ఒక రోజు సీతమ్మ వంటింట్లో కూచుని ఆలుగడ్డలు తరుగుతోంది. పైన పై కప్పుకు బల్లి, బొద్దింకలు దోబూచులాడుకుంటున్నాయి. బల్లి జారి సీతమ్మ తల మీద పడబోయింది. అది చూసి సీతమ్మ కత్తిపీటను పైకి ఆడించింది. బల్లి కత్తిపీటకు తాకింది. తోక చివరి భాగము తెగిపోయింది.

బల్లికి సీతమ్మ మీద కోపమొచ్చింది. సీతమ్మ కత్తిపీటను కడిగేసింది. వెంటనే బల్లి బొద్దింక వద్దకొచ్చింది. బాధపడుతూ “చూశావా బొద్దింక మిత్రమా! సీతమ్మ అనవసరంగా నా తోక కోసేసింది” అన్నది. బొద్దింక నవ్వి “ఆమె కావాలని అలా చెయ్యలేదు మిత్రమా! నువ్వు ఆమె తల మీద పడబోతుంటే కత్తిపీటను గాల్లో ఆడించింది. నువ్వా కత్తిపీట్ల మీద పడ్డావు తోక తెగింది. ఇంకా నయం, పీక తెగితే చచ్చిపోయేదానివి” అని సముదాయించింది.

బల్లికి కోపం చల్లారలేదు. “అలా కాదు. ఆమె కావాలనే నా తోక కోసేసింది. నేను నెత్తిమీద పడితే ఏమి జరిగేదటా?” అడిగింది. బొద్దింక మరోసారి సముదాయిస్తూ “నువు ఆమె తల మీద పడితే ఆమెకు ప్రాణగండమని బల్లిశాస్త్రం చెబుతుందటా. ప్రాణగండం రావద్దని అలా చేసింది” అన్నది.

అంతటితో బల్లి ఊరుకోలేదు “నేనామె మీద ప్రతీకారం తీర్చుకుంటా”నంది. “ఎలా తీర్చుకుంటావు?” అని బొద్దింక అడిగింది. బల్లి మొండితోకను ఆడిస్తూ “నా శరీరమంతా విషం గదా! ఆమె తినే అన్నంలోనో, తాగే నీటిలోనో పడ్తా దాంతో ఆమె ఆ అన్నం తినో, నీళ్లు తాగో చస్తుంది” అంది.

“అది మంచిది కాదు. విషయాన్ని ఇంతటితో వదిలెయ్” అన్నది బొద్దింక. బల్లి ఒప్పుకోలేదు.

మర్నాడు సీతమ్మ పాలగిన్నె పొయ్యిమీద పెట్టి ఏదో పని మీద బయటికెళ్లింది. బల్లి ఊపిరి పీల్చుకుని “చూడు మిత్రమా! నేనా పాల గిన్నెలో పడి చెంగున ఎగిరి బయట పడ్తాను” అని పాలగిన్నెలో దూకింది. పాలు చాలా వేడిగా ఉన్నాయి. బల్లి గిలగిలా కొట్టుకుంటూ ఎగరలేకపోయింది. పాలల్లో మరిగి చనిపోయింది. సీతమ్మ పాలల్లో బల్లిని చూసి పాలను బయట పడేసింది. చచ్చిన బల్లి గూడా బయట పడింది. బొద్దింక బాధపడుతూ “మంచి మాట చెబితే బల్లి వినలేదు. సీతమ్మ తప్పు లేకున్నా ఆమెను శిక్షించబోయింది. చెరపకురా చెడేవు అన్నట్టుగా బల్లికే తగిన శాస్తి జరిగింది” తనలో తాను అనుకుంది.

– ఐతా చంద్రయ్య
m : 93912 05299

కథ

# ది ఘోస్ట్ ఆఫ్ సెవెన్ సీస్

ఒకప్పుడు చాలా మురికిగా ఉన్న ఇంటిని దయ్యాలు వెంటాడేవి. ఇది చాలా దూరంలో ఉన్న బీచ్‌లో, ఒక ద్వీపంలో ఉన్నందున, దెయ్యాల యొక్క వివిధ కుటుంబాలు అక్కడ నివసించడం ప్రారంభించాయి. ప్రజలు ఆ ఇంటి లోపలికి వెళ్ళినప్పుడు, వారు ఆ దెయ్యాల ఇంటి నుండి బయటకు రాలేదు. ఆ ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకున్నాను. దెయ్యాలను ఎలా నియంత్రించాలో నేర్పించే పుస్తకం కూడా ఉందని నేను కనుగొన్నాను. అప్పుడు ప్రజలు ఆ పుస్తకాన్ని చదవడం మరియు ఇంట్లోకి ప్రవేశించడం ప్రారంభించారు. ఎవరూ ఎవరిచేత నియంత్రించబడాలని కోరుకోరు. కాబట్టి సప్తసముద్రాల దయ్యాలు కూడా తమను ఎవరూ నియంత్రించకూడదని భావించాయి. అందుకే ఆ పుస్తకం చదువుతున్న వారిని దెయ్యాలు భయపెడుతున్నాయి. అందుకే మనుషులు రోగాల బారిన పడుతున్నారు, పిచ్చిపట్టడం లేదా చనిపోతున్నారు. కాబట్టి, ఆ పుస్తకం చదివి, వారి కష్టాల నుండి ప్రజలకు సహాయం చేయాలని నేను అనుకున్నాను. అప్పుడు, నేను నా ధైర్యాన్ని కూడగట్టుకుని ఆ పుస్తకాన్ని చదివి ప్రజలకు సహాయం చేయడం ప్రారంభించాను. అందర్నీ బయటికి తీసుకొచ్చి దయ్యాల ఇంటికి తాళం వేశాను.



– అర్హబ్
గ్రేడ్ II, SSC, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్





కథ



# సొర చేప



మా నౌక ఆఫ్రికా తీరాన లంగరు వేసి ఉంది. సముద్రం మీద నుండి చల్లని గాలి వీస్తూ పగటిపూట ఎంతో బాగుంది. కాని సాయంకాలానికి వాతావరణం మారిపోయింది. ఉక్కగా ఉండి మండుతూన్న పొయ్యి గూటిలో నుంచే వచ్చాయా అన్నట్టు సహారా ఎడారి నుంచి వేడిగాడ్పులు మొదలయ్యాయి. సూర్యాస్తమయం ముందు కెప్టెను డెక్కు మీదకి వచ్చి, “స్నానం చెయ్యండి!” అని కేకవేశాడు. నావికులు చెంగున నీటిలోకి ఉరికి తెరచాపను నీటిలోకి దించి, దాని కొసలు నావకు కట్టి ఒక ‘ఈత కొలను’ లాగా ఏర్పాటు చేశారు.

నౌకలో మాతో ఇద్దరు కుర్రవాళ్లు ఉన్నారు. తెరచాప కొలను వాళ్లకి ఇరుకుగా అనిపించి బారుగా ఉన్న సముద్రంలోకి పందెం వేసుకుని ఈత కొట్టుకుంటూ వెళితే బాగుంటుందని అనుకున్నారు. లంగరు దించిన చోట తేలుతున్న పీపా దగ్గరకు ఎవరు ముందు ఈదగలుగుతారో అని పందెం వేసుకున్నారు.

ఒక కుర్రాడు తన స్నేహితుడిని దాటిపోయాడు. కాని మరికాసేపటికి వెనకబడిపోయాడు. ఈ కుర్రవాడి తండ్రి ముసలి ఆర్టిలరీ నావికుడు డెక్కు మీద నుంచుని, తన కొడుకువైపు ముద్దుగా చూస్తున్నాడు. కొడుకు వెనక పడిపోతుండటం చూసి, “వెనకపడకు! ముందుకు వేయ్ బార!” అంటూ అరిచాడు తండ్రి.

డెక్కు మీద నుండి ఎవరో తటాలున, “సొరచేప!” అంటూ కేక వేశారు. ఆ కేక విని మేం అందరమూ ఆ సముద్రపు వింతను చూశాం. సొరచేప ఆ కుర్రవాళ్ల వైపు సరాసరి దూసుకుని వెళు తోంది. “సొరచేప! వెనక్కి వచ్చేయండి, వెనక్కి వచ్చేయండి!” అని ముసలి ఆర్టిలరీ నావికుడు గావుకేకలు పెట్టాడు. కాని కుర్రవాళ్లకి అతని కేకలు వినబడక, వాళ్లు పందెం మొదలు పెట్టినప్పటికంటే మరింత సరదాగానూ, గట్టిగానూ నవ్వుతూ ముందుకు ఈదుతున్నారు. ముసలి ఆర్టిలరీ నావికుని ముఖం పాలలాగా తెల్లబారింది. మనిషి నిశ్చేష్టితుడై కుర్రవాళ్ల వైపు చూశాడు.

పడవను నీటిలోకి దించి, దానిలోకి చప్పున ఉరికారు నావికులు. తమ బలం కొద్దీ తెడ్లువేసి దానిని కుర్రవాళ్ల దగ్గరకు తీసుకుని వెళుతున్నారు. కుర్రవాళ్లకీ సొరచేపకీ ఇరవై అంగలకంటే ఎక్కువ దూరం ఉండదు. కాని అప్పటికి కుర్రవాళ్లకి ఎంతో వెనకగా పడవ ఉంది. వాళ్లను పిలుస్తూ వేస్తున్న కేకలను మొదట్లో పిల్లలు వినిపించుకోలేదు, వాళ్లు సొరచేపనూ చూడలేదు. కాని తరవాత ఒక కుర్రవాడు దానిని చూశాడు. ఆ కుర్రవాడి నోటి నుండి కెవ్వుమంటూ వచ్చిన కేకను మేమందరం విన్నాం. ఇహ కుర్రవాళ్లు మరొక దిశగా ఈదసాగారు. ఆ కేక ఆర్టిలరీ నావికుడిని మేల్కొలిపినట్టు పనిచేసింది. తను ఉన్న చోట నుండి అతడు చెంగున లేచి, ఫిరంగి దగ్గరకు పరిగెత్తాడు. ఫిరంగి మూతిని గిర్రున తిప్పి గురి చూసి, ఫిరంగికి జానకితాడును ముట్టించాడు.

నౌకలో ఉన్న అందరమూ భయంతో గడ్డకట్టుకుపోయాం. ఏమి జరగబోతోందో అని నిరీక్షించాం. ఫిరంగి గుండు ఢణేలుమని ధ్వనించింది. ఆర్టిలరీ నావికుడు ఫిరంగి పక్కన పడి రెండు చేతులతోనూ ముఖం కప్పేసుకున్నాడు. సరిగ్గా ఆ క్షణంలో ఫిరంగిపొగ లేవడంతో సొరచేపకి ఏమైందో, కుర్రవాళ్లకి ఏమైందో చూడలేకపోయాం. పొగ నీటివైపు చెదిరిపోయి అన్ని దిశల నుండి ఒక మూలుగు మొదట వినబడింది, తరవాత ఆ మూలుగు మరింత బలం పుంజుకుంది. చివరకు సంతోషభరితమైన కేక ఒకటి వినిపించింది. ముసలి ఆర్టిలరీ నావికుడు తన ముఖంమీద నుంచి చేతులు తీసివేసుకుని తలెత్తి సముద్రం వైపు చూశాడు. కొన ప్రాణంతో ఉన్న సొరచేప పసుప్పచ్చని పొట్ట కెరటాల పైన కిందకీ, మీదకీ ఊగుతోంది. మరికొంతసేపటికి, పడవ కుర్రవాళ్ల దగ్గరకు వెళ్లి వాళ్లని ఎక్కించుకుని నౌక మీదకి చేర్చింది.

**లియో టాల్ స్టాయ్**
**బాలల కథలు నుండి**

ఆట

# గాలి పటాలు

ఎంతమంది పాల్గొనవచ్చు - ఎంత మందైనా ఆడవచ్చు

ఎక్కడ ఆడవచ్చు - ఆట మైదానంలో


ఈ ఆటకు గల ఇతర పేర్లు - పతంగులు



'గాలిపటాలు' ఒక పుల్లను కాగితంపై మధ్యలో నిలువుగా, మరో పుల్లను కొద్దిగా వంచి పేపరుకు రెండు వైపులా అతికిస్తారు. (పట్టు రావడం కోసం) రంగు రంగుల కాగితాలను చతురస్రాకారంగా కత్తిరించి వాటిని ఒక దారంతో సూత్రం ప్రకారం కట్టాలి. వీటికి తోకలు కూడా ఉంటాయి. ఈ గాలి పటాలు రకరకాల రంగులు, ఆకారాలు, సైజుల్లో ఉన్నప్పటికి వాటి వెనుక ఉన్న ప్రాథమిక సూత్రాలు మాత్రము ఒక్కటే.. గాలి పటానికి దారం ఎక్కడ కట్టాలి? తోక ఎక్కడ తగిలించాలి? ఎంత పెద్దది కట్టాలి? అవన్నీ సరిగ్గా కుదిరినప్పుడే ఈ గాలి పటాలు చక్కగా ఎగురుతాయి. ఆటగాళ్ళంతా ఈ గాలి పటాలకు దారాలను కట్టి గాల్లో ఎగుర వేస్తారు. ఎవరు ఎక్కువ దూరం ఎగుర వేస్తారో వారు గెలిచినట్లు. ఇంకొకరి గాలిపటం గాలిలో ఎగురుతుంటే ఇంకొకరు వారి గాలిపటంతో పేంచ్ వేసి కోసివేయడం ఇందులో మరో పద్ధతి. ఒకే దారానికి ఒకదాని తరువాత మరొక గాలిపటం వరుసగా కట్టి గాలిలోకి ఎగుర వేయడం ఇంకో పద్ధతి. గాలి పటాలను డిజైన్ను బట్టి రకరకాల పేర్లతో పిలుస్తారు అవి. జీబ్రా, పట్టీదార్, ఏక్ తార మొదలైనవి.

**కావలసిన వస్తువులు:**

**రంగు కాగితాలు గర, చీపురు పుల్లలు, గాలిపటాలకు వాడే దారం**




పెద్దలకో మనవి: పిల్లలను పెంచటాన్ని, గాలి పటము ఎగుర వేయటముతో కొంత మంది నిపుణులు పోలుస్తారు. పిల్లలు గాలి పటాలవంటి వారు. వారికి వీలయినంత స్వేచ్ఛ ఇస్తే, పైకి పోతారు. కాని, వారికి అవసరమైతే సహాయము చేయటానికి, పెద్దవారమైన మనము, గాలి పటము దారాన్ని చేతిలో వుంచుకోవాలి. గాలి పటము నిశ్చలముగా, పైకి ఎగురుకుండా ఆగిపోతే, దారాన్ని వెనక్కు గుంజి మరలా వదిలితే, గాలి పటము పైకి పోతుంది. పిల్లలు కూడా అలానే...! వారికి అవసరమైనప్పుడు తగిన భరోసా ఇవ్వాలి. అవసరమైన స్వేచ్ఛ ఇవ్వాలి.

ప్రయోజనం: ఈ ఆట ద్వారా పిల్లల్లో వ్యూహం పన్నడం గురించి మరియు వేగం, నియంత్రణ లాంటి విషయాలు తెలుస్తాయి.

- 'చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు' నుండి...



# బంగారం – డబ్బు




పాతకాలం గురించి చెప్పిన ప్రతిచోట, మనదేశంలో, బంగారమే బంగారం ఉండేదన్న భావన కలిగిస్తారు. వస్త్రాలలో ఈనాటికీ, మనదేశంలో ఉన్నంత బంగారం మరెక్కడా లేదంటారు. ఈ బంగారం అంతా ఏమైంది ఎవరికీ తెలియదు. బంగారం ధర మాత్రం రోజురోజుకు ఆకాశానికి అంటుతున్నదని మాత్రం పిల్లలకు కూడా తెలుసు. అయినా ఈ ప్రపంచంలో మరే వస్తువుకు లేని విలువ బంగారానికి ఉంది. ఎందుకో మరి?

జవాబు కావాలంటే మరొకసారి గతంలోకి వెళ్లి తీరాలి. వేల సంవత్సరాలుగా బంగారం అంటే విలువైన వస్తువు అన్న పేరు ఉంది. అంటే, నిత్యం తెల్లవారినట్టే, రేపు, మరుసటి సంవత్సరం కూడా బంగారానికి విలువ ఉండి తీరుతుంది అన్న నమ్మకం గట్టిగా ఉంది.

డాలరు, రూపాయి, యూరోల విలువ తగ్గుతుంది కానీ బంగారం విలువ తగ్గదు. అంటే బంగారం ఒక గట్టి కరెన్సీ లాంటిదని అర్థం. ఏ రిజర్వ్ బ్యాంక్ కూడా అచ్చు వేయలేని కరెన్సీ అది. ఇప్పుడిక మన చర్చ సైన్స్ లోకి వెళుతుంది.

పీరియాడిక్ టేబుల్ అనే మాట సైన్స్ చదువుకున్న వాళ్లకు అందరికీ తెలిసి ఉంటుంది. మూలకాలను, వాటి



వాటి ధర్మాలను బట్టి ఒక క్రమంలో చూపే మ్యాట్రిక్స్ వంటి లేదా మ్యాప్ వంటి పద్ధతి ఈ పిరియాడిక్ టేబుల్. ప్రస్తుతం ఇందులో 118 రసాయనాలు ఉన్నాయి.. వాటిని అని కాక మూలకాలు అంటే బాగుంటుంది. అయినా వేలాది సంవత్సరాలుగా, అన్ని దేశాలలోని వారు, బంగారానికే గొప్ప గౌరవ స్థానాన్ని ఇచ్చారు. వేల సంవత్సరాలుగా బంగారాన్ని సంపదకు గుర్తుగా వాడుకున్నారు. అందుకే బంగారం ధర అంతకంతకు పెరుగుతున్నది.

అయితే ఒక ప్రశ్న! ఒక్క బంగారానికి ఈ గౌరవం ఎందుకు కలిగింది? మరో ఆస్మియం, లితియం, రుతేనియంలకు ఈ గౌరవం ఎందుకు లేదు? ప్లాటినం గొప్పది అన్నారు. కానీ దాన్ని ఎవరూ కొనరు. ఎందుకని? ఈ ప్రశ్నలను నిజమైన నిపుణులను అడగాలి.

కొలంబియా విశ్వవిద్యాలయంలో సనత్ కుమార్ అని ఒక కెమికల్ ఇంజనీర్ ఉన్నారు. మనవాడు అంటే భారతీయుడు అని వేరుగా చెప్పవలసిన అవసరం లేదు. పిరియాడిక్ టేబుల్‌లోని మిగతా రసాయనాలు ఘనంగా ఎందుకు పనికిరావు అన్న ప్రశ్నకు ఆయన జవాబు ఇచ్చారు. వీరి ఆడిక్ టేబుల్ గడులు గడులుగా ఉంటుంది. అందులోని ఒక్కొక్క గదిలో ఒక మూలకం ఉంటుంది. వెండి, బంగారం పక్కపక్కన ఉంటాయి. కార్బన్ వంటివి మరొక పక్కన ఉంటాయి.

టేబుల్‌లో కుడి పక్కన కొన్ని చాలా ఉపయోగకరమైన రసాయనాలు ఉంటాయి. వాటి లక్షణాలు కూడా చాలా గొప్పవి. ఆ లక్షణాలు ధర్మాలు ఒక పట్టాణ మారవు. అంటే, ఈ మూలకాలు రసాయన పరంగా చాలా స్థిరమైనవి అని అర్థం.. కానీ ఒక్కటే సమస్య! ఇవన్నీ వాయు రూపంలో ఉంటాయి. ఆక్సిజెన్, హైడ్రోజెన్ లాంటివన్నీ వాయు మూలకాలు. ఈ రకం మూలకాలను సీసాలో పోసి మూత బిగించి దాచుకోవచ్చు. కానీ మూత తీస్తే మాత్రం మనం బికారీలము అవుతాము. అంటే ఈ కుడిపక్క రసాయనాలు, ఎంత మంచివయినా, సంపదగా పనికిరావు. సనత్ గారు వాటిమీద క్రాస్ మార్క్ పెట్టేశారు.

ఇక టేబుల్ ఎడమవైపున ఉన్న గళ్ళకు వెళ్లాలి. అక్కడ లితియం తోబాటు మరిన్ని రసాయనాలు ఉంటాయి. ఈ లితియం ను కూడా సీసాలో పోసి మూత పెట్టాలి. మూత తెరిస్తే, దానికి గాలి తగిలితే, అది భగ్గున మండిపోతుంది. పుట్టే మంట చాలా గొప్పది. భవనం కాంక్రీట్ పైకప్పు కూడా బూడిదవుతుంది. డబ్బులు తగలబెట్టడం మంచి ఆలోచన కాదు.. ఇక డబ్బు తనంతతానే తగలబడుతుంది అంటే ఆలోచన అసలే మంచిది కాదు. సంపదగా దాచుకోవలసిన మూలకం ఏ రకమైన రసాయన చర్యలకు గురికాకుండా ఉంటే మంచిది. కానీ పీరియాడిక్ టేబుల్ లోని 118 మూలకాలలో ఎక్కువ శాతం చాలా తొందరగా రసాయనిక చర్యలకు గురి అయ్యేవే! అన్ని తగలబడి మండకపోవచ్చు. కొన్ని తుప్పు పడతాయి. మరికొన్ని ప్రకృతిలోనే వివిధ అంశాల కారణంగా పొడిగా మారి మాయమవుతాయి. ఈ రకంగా లెక్కవేసి సనత్ గారు మరో 30 నుంచి 40 మూలకాల మీద ఎర్ర గుర్తు వేసేసారు.

పీరియాడిక్ టేబుల్ లో కింద విడిగా రెండు వరుసగా రసాయనాలు ఉంటాయి. వాటికి అక్టినాయిడ్స్, లాంతనాయిడ్స్ అని పేరు. అక్కడ గమనిస్తే ఐన్ స్టీనియం, ప్రొమేతియం లాంటి ఆసక్తికరమైన పేర్లు కనిపిస్తాయి. ఐన్ స్టైన్ మహా జ్ఞాని అయిన పరిశోధకుడు. ప్రోమెతాయిస్ అంటే పాశ్చాత్య పురాణాలలోని ఒక గొప్ప దేవుడు. ఆ సంగతి పక్కన పెడితే ఈ రసాయనాలు అన్నింటికీ రేడియో యాక్టివిటీ అనే లక్షణం ఉంటుంది. వాటిని జేబులో లేదంటే ఇంట్లో పెట్టుకుంటే ప్రాణాలకే ముప్పు వస్తుంది. ఆ రసాయనాలు వేరే రసాయనాలుగా మారిపోతాయి. కనుక అవి కూడా ఘనంగా పనికిరావు. వాటి మీద కూడా రెడ్ మార్క్ వేసేయాలి.

ఇప్పటికీ ఉన్న మూలకాలలోనించి ముప్పయి మాత్రం మిగిలి నిలిచాయి. మనకు అవి ఉపకరించాలని అంటే ఉండవలసిన లక్షణాలు గురించి కూడా తెలిసింది. వాయువులు పనికి రావు. పాడయే రసాయనాలు పనికిరావు. మనల్ని చంపగల రసాయనాలు అసలే వద్దు. వీటన్నింటినీ మించి మరొక లక్షణం కావాలి. ఈ రకంగా చూస్తే మిగిలిన వాటిలో కూడా కొన్నింటి మీద రెడ్ మార్క్ పడింది. ఆస్మియం అనే రసాయనం చాలా అరుదుగా ఉంటుంది. అంటే సులభంగా దొరకదు అని అర్థం. అది అంతరిక్షం నుంచి వస్తుంది. కనుక దానికి రెడ్ మార్క్ పడాలి.

ఇక చివరకు ఐదు మూలకాలు మిగిలాయి. రోడియమ్, పెలేడియమ్, ఆర్జెంటమ్ అనే వెండి, ప్లాటినం, ఆరమ్ అనే బంగారం. బంగారం అన్న తెలుగు మాటలో

ఆ లోహం యొక్క శాస్త్రీయ నామం చివరిలో దాగి ఉందని గమనిస్తే ఆశ్చర్యం కదూ! ఇవన్నీ మామూలుగానే విలువైన మూలకాలు, అందునా ఘన పదార్థాలుగా ఉండే లోహాలు. వీటిలోనూ కొన్నింటికి సెలవు ఇవ్వాలి. వెండి బాగా వాడుకలో ఉంది. కానీ చాలా సులభంగా మకిలి అవుతుంది. వెండి కంచాలు గ్లాసులు వాడే వారికి ఆ సమస్య గురించి తెలిసే ఉంటుంది. రోడియమ్, పెలేడియమ్ మనిషికి తెలిసి రెండు వందల సంవత్సరాలు మాత్రమే అయింది.

అంటే చివరకు ప్లాటినమ్, బంగారం అనే ఆరమ్ మిగిలాయి. ఇవి నదుల్లో, ప్రవాహాల్లో దొరుకుతాయి. ప్లాటినం ను కరిగించాలంటే మరీ ప్రత్యేకమైన కొలిమి కావాలి. మూడు వేల డిగ్రీల ఫారెన్ హైట్ వేడి ఉంటే కానీ ఈ లోహం కరగదు. కనుక నగలు చేయాలన్నా నాణాలు చేయాలన్నా కష్టం!

బంగారం చాలా తక్కువ వేడికే కరుగుతుంది. అందుకే సాంకేతిక సదుపాయాలు తెలియని కాలంలో కూడా దాన్ని కరిగించారు. బంగారం సులభంగా మకిలి కాదు. ఈ లోహం చాలా మృదువుగా ఉంటుంది. కనుక సులభంగా బిళ్ళలుగా, తీగలుగా కావలసిన మరిన్ని ఆకారాలుగా మార్చుకోవచ్చు. చాలా పలుచనైన పొరలుగా కూడా దాన్ని మార్చవచ్చు. అది సులభంగా మారదు కనుక దాన్ని నోబుల్ మెటల్ అన్నారు. రాగి వంటి మిగతా రసాయనాలతో కలిపి దాన్ని మిశ్రలోహంగా కూడా వాడుకోవచ్చు.

కాలచక్రాన్ని గిరగిరా తిప్పి చరిత్ర మొదటికి వెళ్ళాము అనుకుందాము. బంగారం బదులు మరేదైనా మూలకం సంపదగా వచ్చే వీలుందా? మనకు కావలసిన లక్షణాలు అన్నీ ఉండాలంటే ఈ భూమి మీద బంగారాన్ని మించినది లేదు!

కానీ చిత్రం చూడండి! మనం బంగారాన్ని డబ్బుగా వాడడం లేదు. ఒకప్పుడు వాడుకునే వారట! మనమేమో అతి తెలివిగా కాగితాన్ని ఘనంగా వాడుకుంటున్నాము. కాగితం మనలను చంపదు. కానీ కాలిపోతుంది. కావలసినంత దొరుకుతుంది. దాన్ని మనమే తయారు చేసుకుంటాము. దానిమీద విలువ ఇస్తూ బొమ్మలు అక్షరాలు హత్య చేసుకుంటాము. అయినా అది ఏ రకంగానూ బంగారానికి సాటి రాదు. కనుకనే బంగారానికి అంత విలువ!

## డబ్బు

ఈజిప్ట్, మెసపొటేమియా దేశాలలో క్రీస్తుపూర్వం 2500 నాడే వెండి. బంగారాలను ధనంగా వాడుకున్నారు. అందువల్ల పన్నులు వసూలు సులభమైంది అన్నారు.

డబ్బు వచ్చింది. దొంగతనాలు వచ్చాయి. గుడులు బ్యాంకులుగా మారాయి. ఆ నిర్మాణాలు గట్టివి గనుక ధనం గుడులలో దాచుకున్నారు. కానీ వాటికి భయం పెరిగింది.

క్రీస్తుపూర్వం 1750 ప్రాంతంలో గుడుల అధికారులు అప్పులు ఇవ్వడం మొదలుపెట్టారు.

క్రీస్తు శకం 910 ప్రాంతంలో చైనా వారు కాగితం డబ్బులు వాడకం మొదలుపెట్టారు.

చక్రవర్తి కుబ్లయ్ ఖాన్, అంతులేకుండా నోట్లు అచ్చు వేసేవాడని మార్కో పోలో రాశాడు.

అమెరికాలో ప్రస్తుతం సుమారు వెయ్యి బిలియన్ డాలర్ల విలువగల నాణాలు, నోట్లు చలామణిలో ఉన్నాయి అంటున్నారు. అందులో మూడింట రెండు వంతుల ధనం వేరే దేశాలలో ఉందట.

కాగితం నోట్లు మురికి ఆలవాలాలు. వాటి మీద మాదకద్రవ్యాలు, సూక్ష్మజీవులు, చివరికి మనుషుల మలం కూడా పెద్ద ఎత్తున ఉంది అంటున్నారు. నోట్లను శుభ్రం చేయాలని ఎవరూ అనుకోరు. అవి ఎక్కడి నుంచి వచ్చాయి అని కూడా చూడకుండా ప్రేమగా జేబులో పెట్టుకుంటారు. చాలా మందికి డబ్బులు ముట్టుకుంటే ఎలర్జీలు వస్తున్నాయి.

యూఎస్ నోట్లు తయారీకి వాడే కాగితం ముఖ్యంగా దూది నుంచి వస్తున్నది. పావుభాగం నిజానికి రేయాన్ నుంచి వస్తున్నదట.

క్రెడిట్ కార్డులు రావడానికి ప్రారంభంగా ముందు డైనర్స్ క్లబ్ కార్డ్ వచ్చింది.. అదొక అట్ట ముక్క.

1967లో భార్క్ లేస్ బ్యాంక్ వారు మొట్టమొదటి ఏటీఎం అనే ఆటోమేటెడ్ టెల్లర్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. పర్సనల్ ఇండెక్స్ నంబర్ అనే పిన్ కూడా అప్పుడే వచ్చింది.


– గోపాలం కె బి
m : 98490 62055

# భారతీయ మహిళా శాస్త్రవేత్తల విజయ గాథలు

'ఏ గర్ల్స్ గైడ్ టు ఎ లైఫ్ ఇన్ సైన్స్' పేరున ఒక పుస్తకం ఆ మధ్యన వెలువడింది. విజ్ఞాన శాస్త్రలోకంలో సాగాలంటే బాలికలకు మార్గదర్శి అని మనం ఆ పేరుకు అర్థం చెప్పుకోవచ్చు. దీనిని ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రచురించింది. మనదేశంలోని బాలికలకు సైన్స్ పరిశోధన పట్ల ఆసక్తి కలిగిస్తూ మార్గ నిర్దేశం చేయడానికి ఈ ప్రయత్నం జరిగింది. దీనికంటే ముందు 2008లో 'లీలావతి'స్ డాటర్స్' పేరున ఒక విలువైన గ్రంథం వచ్చింది. ఈ రెండు పుస్తకాలు గురించి మళ్ళీ చర్చ జరగడానికి కారణం, ఇటీవల అంటే 2024 అక్టోబర్ 25న ఆ పుస్తకాల సంపాదకులలో ఒకరైన డా రోహిణి గుడ్బోలె కనుమూయడం.

ఈ పుస్తకం పేరు మరింత తమాషాగా ఉంది కదా? లీలావతి కూతుళ్లు... ఎవరు.. ఏమిటి అని అందరికీ సందేహం వచ్చే అవకాశం ఉంది. 12వ శతాబ్దానికి చెందిన భాస్కరాచార్యులు అనే గణిత శాస్త్రవేత్త తన కూతురు లీలావతి పేరున ఒక పుస్తకాన్ని రచించారు, అదే 'లీలావతి గణితం' గా పేరు మోసింది. ఈ పుస్తకం గురించి, పుస్తకం వెనుక నేపథ్యం గురించి ఇంకొకసారి చెప్పుకుందాం. ప్రస్తుతం భారతదేశపు మహిళా శాస్త్రవేత్తల గురించి వివరించే ఈ 'లీలావతిస్ డాటర్స్' పుస్తకం నేపథ్యం ఏమిటో తెలుసుకుందాం. ఎందుకంటే మీలో కూడా చాలామంది ముందు ముందు శాస్త్రవేత్తలుగా ఎదగాలి. మీరు బాలికలైతే ఆ మహిళా శాస్త్రవేత్తలు ఎన్ని సమస్యలను ఎదుర్కొంటూ పట్టుదలగా పైకి వచ్చారో తెలుసుకోవాలి, అలాంటి విజయపథంలో సాగాలి. అదే బాలురైతే ఏ రకంగా తోటి బాలికాశాస్త్రవేత్తలకు, యువశాస్త్రవేత్తలకు తోడ్పడాలి, ఉత్సాహం ఇవ్వాలి అని నేర్చుకోవాలి.

1952 లో పూనాలో జన్మించిన రోహిణి గోడ్బోలే చదువు యూనివర్సిటీ ఆఫ్ బాంబే, ఐఐటి బాంబేలలో సాగింది. బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లో చాలా కాలం పనిచేసే సూపర్ కెమిస్ట్రీ, పార్టికల్ ఫిజిక్స్ వంటి అంశాలలో గొప్ప పరిశోధన చేశారు. కనుకనే




భారతప్రభుత్వం రోహిణి గుడ్బోలెకు పద్మశ్రీ గౌరవాన్ని బహూకరించింది. 2002 లో పారిస్ నగరంలో తొలి అంతర్జాతీయ మహిళా భౌతిక శాస్త్రవేత్తల సమ్మేళనం జరిగింది. ఈ సమావేశంలో భారతదేశ ప్రతినిధిగా రోహిణి గుడ్బోలే పాల్గొన్నారు. ఆ సమావేశం కారణంగా భారతదేశపు బాలికలు, యువతులకు విజ్ఞాన శాస్త్ర పరిశోధన పట్ల ప్రేరణ కలిగించాలని ఆలోచించారు. మన దేశంలో పరిశోధనా రంగంలో కష్టసుఖాలు తెలిసిన మహిళా శాస్త్రవేత్తలతోనే తమ గురించి రాయించాలని భావించారు. అలా వెలువడింది 'లీలావతి'స్ డాటర్స్' పుస్తకం.

2008లో నిలబడిన ఈ పుస్తకంలో 9 మంది ప్రఖ్యాతులైన, కనుమూసిన మహిళా శాస్త్రవేత్తల గురించిన వ్యాసాలు ఉన్నాయి. అలాగే మరో 91 మంది మహిళా శాస్త్రవేత్తలు తమ అనుభవాలను రాశారు. ఈ పుస్తకం మలయాళం, కన్నడం, హిందీ, గుజరాతి భాషల్లో ఇంతవరకు అనువాదమయ్యింది. తెలుగులో ఇంతవరకు రాలేదు. ఇంగ్లీషులోని 'లీలావతి'స్ డాటర్స్' పుస్తకాన్ని కొద్దిగా కుదించి, 'ఏ గర్ల్స్ గైడ్ టు ఎ ఏ లైఫ్ ఇన్ సైన్స్' అనే పుస్తకాన్ని కూడా వెలువరించారు.

– డా నాగసూరి వేణుగోపాల్
m : 9440732 392





# తెలంగాణ - చారిత్రక పర్యాటకం

కొత్త విషయాలను తెలుసుకోవాలన్న కుతూహలం పిల్లల్లో ఎక్కువగా ఉంటుంది. చారిత్రక స్థలాలు, కట్టడాలు, ప్రదర్శన శాలల సందర్శన మనసులో ఎప్పటికి నిలిచి పోతుంది. అలా పిల్లలందరూ వాళ్ళ పాఠశాల నుండి మరో కొత్త ప్రదేశానికి వెళ్ళి రావడాన్ని విజ్ఞాన యాత్రగా పిలుస్తాం. గతాన్ని అద్దంలా చూపేదాన్ని, ప్రస్తుతాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడేదాన్ని, భవిష్యత్తును మన కళ్ళముందు ఆవిష్కరింపజేసేదాన్ని ఇంగ్లీషులో 'మ్యూజియం' అని అంటారు. ఇలాంటి మ్యూజియంలు మన తెలంగాణా రాష్ట్రంలో అక్కడక్కడ జిల్లా ప్రదర్శన శాలలుగా, హైదరాబాద్‌లో పలు మ్యూజియాలు అందుబాటులో ఉన్నాయి. మ్యూజియాల్లో అతి ప్రాచీనం నుండి ఒక వరుస క్రమంలో మనం చూస్తూ ఉంటాం. శిలాజాలు ఇక్కడ మనం ముందుగా శిలాజాల గురించి తెలుసుకుందాం. కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం నుండి తెలంగాణ ప్రాంతం జీవ వైవిధ్యానికి నెలవుగా ఉంది. ప్రాణహిత, గోదావరి, నదీ తీరాల్లో వృక్ష శిలాజాలు, జంతు శిలాజాలు మనకు చారిత్రక ఆనవాళ్ళుగా లభించాయి.

ఫాజిల్ అనే ఆంగ్లపదం లాటిన్ పదమైన ఫాడెరి నుంచి పుట్టింది. కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం తిరుగాడిన డైనోసార్లు అనేక ప్రకృతి విపత్తుల మూలంగా అంతరించి పోయాయి. కొన్ని లక్షల ఏళ్ళ కాలంలో వాటి శరీరాలు, గుడ్లు శిలాజాలుగా మారగా, మరికొన్ని ప్రాంతాల్లో అగ్ని పర్వతం యొక్క లావా వాటిపై ప్రవహించి అవి శిలాజాలుగా రూపాంతరం చెందాయి. అమెరికాల్లాంటి దేశాల్లో మాత్రమే రాక్షసబల్లుల అవశేషాలు ఉండేవని మనం అనుకుంటాం కాని, మన దేశంలోనూ, ముఖ్యంగా మన తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వంద సంవత్సరాల క్రితమే ఆంగ్లేయుల కాలంలో, ఖనిజాల కోసం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సర్వే చేస్తున్న క్రమంలో రాక్షసబల్లుల శిలాజాలు దొరికాయి. జిఎస్ఐకి చెందిన తెలుగు పరిశోధకులు పొన్నాల యాదగిరి గారు ఆదిలాబాద్ జిల్లా వేమనపల్లి అనే ప్రాంతంలో 1974-80 ప్రాంతంలో రాక్షసబల్లి అవశేషాలను గుర్తించారు. 12 డైనోసార్లకు చెందిన 840 అవశేషాలతో 16 అడుగుల ఎత్తు, 44 అడుగుల పొడవు రాక్షస బల్లి శిలాజాన్ని బిర్లామందిర్ దగ్గర బిర్లా సైన్స్ మ్యూజియంలో మనం ప్రత్యక్షంగా చూడవచ్చును. ఆసియాలో అత్యంత పురాతన ప్రాథమిక డైనోసార్ మంచిర్యాల జిల్లాలో లభించింది. కొమరంభీం అసిఫాబాద్ జిల్లాకు 5 కి.మీ. దూరంలో ఆదిమ మానవుని అస్థికలు ప్రాణహిత నది పరిసరాల్లో ఠాకూర్ రాజారాం సింగ్ 1980లో కనుగొన్నారు. నిజామాబాద్ జిల్లాలో చేపలు, బల్లులు, పాములు, ఉభయచరాలు, సరీసృపాల శిలాజాలు లభించాయి. కొమురంభీం అసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం కొండపల్లి అడవిలో 15 ఎకరాల్లో వృక్ష శిలాజాలను 2014లో తెలంగాణా చరిత్ర బృందం గుర్తించింది. గోదావరి ఖనికి చెందిన సముద్రాల సునీల్ అనే గతంలో బయల్పడిన, భవిష్యత్తులో విస్తృత పరిశోధనలు చేసి సేకరించే జంతు, వృక్ష శిలాజాలతో ఒక మ్యూజియం ఏర్పాటు చేస్తే పరిశోధకులకు, విద్యార్థులకు, ఉపయోగకరంగా ఉంటుంది.

- దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి
m : 9010051177

# పిల్లలం మర్రి పిల్లలం



పిల్లల మర్రి పిల్లలం
తెల్లని వన్నె మల్లెలం
పాలమూరు వారలం
పాలుగారు పోరలం!

మా ఊరు పాలమూరు
ఉంటుంది జోరుదారు
వీక్షించితే ఇక మీరు
హర్షించక ఉండలేరు!

మెటుగడ్డ ప్రాంతమందు
పిల్లలమర్రి క్రింద విందు
ప్రతినిత్యం చేసుకుంటాం
వ్రతకృత్యం చూసుకుంటాం!

పిల్లలమర్రి చెట్టు క్రింద ఆడుకుంటు
పుట్టతేనె పట్టుగాను జుర్రుకుంటు
కలసిమెలసి ఆటలే ఇక ఆడుతాం
అలసిసొలసి పాటలే మేం పాడుతాం!

ఊడల ఉయ్యాల్లో ఊపేస్తుంది
నీడలవాడల్లో మము దింపేస్తుంది
అమ్మలాగ మమ్ముల ప్రేమిస్తుంది
గుమ్మపాలు గమ్మున తాపిస్తుంది!

ఎనిమిది వందల ఏళ్ళనాటి చెట్టు
మూడున్నర ఎకరాలలో తన పట్టు
బిగిస్తూ విస్తరిస్తూ వస్తూనే ఉంది
చిగిగిస్తూ పచ్చగాను తానుంది!

పిల్లలమర్రి సుందర్ వృక్షం
పర్యాటక ప్రజలందరి పక్షం
శతమానం భవతేగా లక్ష్యం
శతాబ్ధి చరితకు అది సాక్ష్యం

– గుర్రాల లక్ష్మారెడ్డి
m : 9491387977

# చింత గింజ చిన్నది



చింతగింజ చిన్నదీ
రై... రై... మన్నదీ

పట్టుకోని పగులగొడితే
రెండు పచ్చెలైనదీ...


తిరగవేసి ఆట ఆడ్తె
అష్ట చెమ్మ... ఐనదీ..!



– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105

కథ

# గోటీలాట



'నాన్నా' ఒక ఫైవ్ రుపీస్ ఇవ్వు నాన్న, "ఎందుకు? "గోటీలు కొనుక్కుంటా, ఇవ్వాళ ఆదివారం పిల్లలందరం చింతచెట్ల కింద దొబ్బుడు ఆట ఆడుకుందామని అన్నారు". అని నాల్గో తరగతి విద్యార్థి శేఖర్, వాళ్ల నాన్నతో అన్నాడు.

"మొన్న షాపుల కొనిస్తిగదరా? అవి ఆటల పోయినవి, ఈ రోజు తప్పకుండా సంపాదిస్తా " అని శేఖర్. "చూచిరాత బుక్కులకని మొన్నటికి మొన్న యాభై రూపాయలు, పెన్సిల్లు, రబ్బర్లు కావాలని నిన్న ఇరవై రూపాయలు, ఇయ్యాళ ఐదు రూపాయలు, పైసల చెట్టు ఉందను కున్నావా? సర్కారు బడే గదా?, కోపంతో ఇటురా, అంటూ చెంపల మీద ఛడామడా వాయించాడు. అటల గోటీలు సంపాదించే తెలివిలేదు గాని, గోటీలకు పైసలట, ఛల్ ఇక్కడి నుండి నడువు" అంటూ గదిమాడు. శేఖర్ ఏడ్చుకుంటూ ఇంటిముందు అరుగుమీద కూచున్నడు. మక్క గారెలు తింటున్న శేఖర్ చెల్లె ఈ సంగతి పక్కింటి ఆరో తరగతి చదివే రమేశన్నకు చెప్పంగానే చిన్న కవర్ల, ఎర్రగోటీలు, నీలం, పిక్కు, డుంబు గోటీలు ఆరేడు పట్టుకొని వచ్చిండు.

'శేఖర్ ఏమైందిరా?'. 'ఏం లేదురా, ఎందుకు ఏడుస్తున్నవురా? అంటే వట్టిగనే అంటుండగనే వాళ్ల నాన్న కోపంగా బయటకు వచ్చి' పోరగాళ్ళకు పనిలేదు, పాటలేదు. గోటీలు సంపాదించే తెలివి లేదు. ఇక సదువులు సదువుతురు అంటూ, ఈడికి నువ్వెందుకు వచ్చినవు, నువ్వు కూడా మావోని అసోంటివాడివే'.

'అయ్యో, అంకుల్, కోపానికి రాకుర్రి, మొన్న శేఖర్, ఆటల పది పన్నెండు గోటీలు సంపాందించి అవి నాకు ఇచ్చినవి, సంచిలో వేసాను మర్చిపోయిండు, ఇపుడు నేను సంచిలో చూస్తే శేఖర్ గోటీలు. ఇవి ఇవ్వడానికి ఇక్కడికి వచ్చాను'.

అంకుల్, శేఖర్ లెక్కలల్ల ఫస్టు, ఇంగ్లీష్ ఫస్టు, క్లాసుల ఫస్టు

ఒక్కసారి మా బడికి రాన్రి, వచ్చిచూడుర్రి అంకుల్ అని రమేశ్ అంటుండగనే, బయట నుంచి కూరగాయలతో

వచ్చిన శేఖర్ అమ్మ, కొడుకు ముఖం చూసి బాధపడి ఎందుకుకొట్టినరండి, అని అడిగితే 'కొట్టిన కోపమచ్చి, పైసలట, పైసలు' ....

అయిన వాడేమి పైసలు తింటలేడు, ఉల్టా ఖర్చు పెడతలేడు. కాఫీలకని యాభై ఇచ్చావట, పది రూపాయలు తక్కువైన, భూమేన్నేటు కాఫీలు ఇచ్చాడట, మీ వాళ్లను అడుగుకొంటానంటే, పెన్సిల్లకు డబ్బులిస్తే ఆ డబ్బులకు సరిపడే పెన్సిల్లు కొనుక్కున్నాడట ఎక్కువ ధరది వద్దు మామూలు అయినా సరేనని చెప్పేసరికి తండ్రికి నోటమాట రాలేదు.

వాడేమన్నా క్రికెట్ బ్యాటు, క్రికెట్ కిట్టు అడిగాడా? ఏమన్న వందలా, వేలా, వాడేం జేబులల్లకెల్లి దొంగతనాల్జి చేయలేదు. ఐదు రూపాయలు, ఐదు రూపాయలు అని గొణుక్కుంటు శేఖర్ని లోపలికి తోలుకపోయింది.

అత్తమ్మ ఆటల పోతయి, వస్తయి గంతేగని అట్లకొడితే ఎట్ల? ఇంకా బాగా కొడతాడో ఏమో, ఇంక ఏమన్న అంటడేమోనని శేఖర్ గోటీలని చెప్పడానికి తెచ్చానని ఇచ్చాడు.

ఆటల్లో ఏకాగ్రత పోటీతత్వం, సంబంధ బాంధవ్యాలు ఒక లక్ష్యం వంటివి కల్గుతాయని సురేష్ సారు చెప్పిండు. సారు మా బ్యాగులల్ల గోటీలు చూసి ఎప్పుడు ఏమనలేదు. వీటిని లెక్కలకు కూడా వాడండి అని చెప్పి మొన్న ముగ్గురికి నల్లసరం గోటీలిచ్చిండు. తనవి చిన్నప్పటి గోటీలట.

వాళ్ళ నాన్నకేం ఖర్చు యూనిఫాం స్కూళ్లనే, పుస్తకాలు కాపీలు స్కూళ్ళనే మధ్యాహ్నభోజనం స్కూళ్లనే చదువుకున్న టీచర్లు ఇంకేం కావాలి ఈయనకేమన్న ఖర్చయిందా అంటూ గొణుక్కుంటు పిల్లలు తినటానికి మక్కగారెలు తేవడానికి వంటగదిలోకి వెళ్లింది.

– గరిపెల్లి అశోక్
గోటీలాట పిల్లల కథలు
m : 94404 90384

## సామెతలు

- చెరువుకి నీటి ఆశ, నీటికి చెరువు ఆశ
- డబ్బుకు లోకం దాసోహం
- గతి లేనమ్మకు గంజే పానకము
- కాగల కార్యము గంధర్వులే తీర్చినట్లు
- కొన్న దగ్గిర కొసరు గాని కోరిన దగ్గర కొసరా
- క్షేత్ర మెరిగి విత్తనము పాత్ర మెరిగి దానము
- మనిషి పేద అయితే మాటకు పేదా
- నడమంత్రపు సిరి నరాల మీద పుండు
- నవ్వు నాలుగు విధాలా చేటు
- పోరాని చోట్లకు పోతే రారాని మాటలు రాకపోవు
- సంతోషమే సగం బలం
- శ్వాస ఉండే వరకు ఆశ ఉంటుంది
- కలకాలపు దొంగ ఒకనాడు దొరుకును.

– బాలచెలిమి

## శేషప్ప కవి జీవితం సాహిత్యం పై వ్యాసరచన పోటీ

సుప్రసిద్ధమైన నరసింహ శతక కర్త ధర్మపురి శేషప్పకవి జీవితం, సాహిత్యం పై తెలంగాణ సారస్వత పరిషత్తు వ్యాసరచన పోటీ నిర్వహిస్తున్నది. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్కులైన యువతీ యువకులు పోటీలో పాల్గొనవచ్చు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద 4000, 3000, 2000 రూపాయలు, ఇవి కాకుండా తర్వాతి శ్రేణిలో మరికొన్ని ప్రశంసాత్మక బహుమతులు ఉంటాయి. వ్యాసం నిడివి 10 పుటలకు మించరాదు. తమ సొంత రచన అని స్వీయ ధ్రువీకరణ ఉండాలి. వయసు రుజువుగా పదో తరగతి ధ్రువీకరణ పత్రం జత చేయాలి. 2025 జనవరి 20వ తేదీలోగా చేరే విధంగా తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్డు, ఆబిడ్స్, హైదరాబాద్-1 చిరునామాకు పంపాలి.

– డా.జె.చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు, హైదరాబాద్.



# రేగు చెట్టు

హాయ్ బాలలూ.. బాగున్నారా!

అందరికీ 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ కొత్త సంవత్సరంలో సంక్రాంతి అతి ముఖ్యమైన పండుగ. ఈ పండుగ అనగానే యాదికొచ్చేది గంగిరెద్దులు, గొబ్బెమ్మలు, రేగు పండ్లు. ఈ జనవరి నెల “బాల చెలిమి” సంచికలో రేగు చెట్టు గురించి తెలుసుకుందాం.

రేగు చెట్టు అనేది ఒక పండ్ల చెట్టు. ఇది జిజిఫస్ ప్రజాతికి చెందినది. సాధారణంగా చిన్న చిన్న ముళ్ళు, గుండ్రటి చిన్న ఆకులు కలిగి కంచెలలో, గెట్లపొంటి, బంజరు భూములలో పెరుగుతూ ఉంటది. నీటి ఎద్దడిని తట్టుకుంటూ పునాస పంట చేనులలో కూడా పెరుగుతుంది. జనవరి నెల వచ్చిందంటే చాలు రేగి పండ్లు బోలెడు కనిపిస్తాయి. రేగు పండ్లు అంటే ఇష్టపడని వారు ఎవరూ ఉండరు. పిల్లలు మరి బాగా ఇష్టపడతారు. “పండు పండు పండు– రేగుపండు / చెల్కలల్ల పండే భలే చౌక గుండు / సి విటమినుండే చిత్రమైన పండు / పుల్ల తీయని పండు – ఇవ్వు నాకు రెండు” అని రేగు పండ్లు తినుకుంట చిన్నప్పుడు పాడుకుంటారు. ఎనుకటి రోజులలో ఊర్ల పొంటి ఉన్న బాల బాలికలు సెలవు రోజుల్లో సెల్కలకు పోయి రేగు పండ్లు బాగా తినేవారు. తినగా మిగిలిన వాటిని రోట్లో వేసి దంచి అప్పలు చేసి ఎండబెట్టి తింటే మస్తు రుచిగా ఉండేది. రేగుపండ్లు తియ్యగా పుల్లగా ఉండి గుజ్జుని కలిగి కమ్మగా ఉంటాయి. కాయలుగా ఉన్నప్పుడు ఆకుపచ్చ రంగులోను పండ్లు మాత్రం బంగారు ఎరుపు వన్నెలో పండుతాయి. రేగుపండ్లలో గంగ రేగు పండ్లు కూడా ఉంటాయి. రేగు పండ్లను సూర్యుడి చిహ్నంగా భావిస్తారు. సంక్రాంతి సందర్భంగా భోగి పండుగ రోజున పిల్లలు భోగభాగ్యాలతో తులతూగాలని ఈ పండ్లను తలపై పోస్తూ దీవిస్తూ వేడుకలు చేస్తారు. అందుకే వీటిని భోగి పండ్లు అని కూడా అంటారు. వినాయక చవితి రోజున ఏకవిశతి పత్రి పూజా క్రమంలో రేగు ఆకు ఐదవ ఆకుగా వినాయకుని పాదాల చెంత అర్పిస్తారు. ఈ చెట్లు మొలిచిన మూడు సంవత్సరాలలో పండ్లనిస్తాయి. ప్రతి ఏటా దీన్ని నరికివేసిన మళ్లీ మళ్లీ ఇగురు పెట్టి పెరుగుతుంది ఒక చెట్టు సుమారుగా రెండు వేల నుండి ఐదు వేల పండ్లు కాస్తుంది. పూర్వం రేగు కంపను పశువుల దొడ్లకు కంచెగా కూడా రైతులు వాడేవారు ఈ రేగు చెట్టు వలన ఇలా మరెన్నో ప్రయోజనాలు కూడా ఉన్నాయి.


### రేగు చెట్టు వల్ల ప్రయోజనాలు :

* రేగు పండ్లు తింటే కడుపులో మంట తగ్గుతుంది. జీర్ణశక్తి పెరుగుతుంది.
* రేగు గింజలు పొడిచేసి నూనెలో కలిపి రాసుకుంటే కీళ్ల నొప్పులు తగ్గుతాయి.
* రేగు చెట్టు బెరడును నీళ్లలో మరిగించి డికాషన్‌గా తాగితే నీళ్ల విరేచనాలు తగ్గుతాయి.
* రేగు పండ్లను అర లీటర్ నీటిలో వేసి మరిగించి పంచదార గాని, తేనె గాని కలిపి తాగితే ఆరోగ్యం చాలా మంచిది.
* రేగు పండ్లు తరచూ జ్వరం, జలుబు రాకుండా చేస్తాయి.
* తలనొప్పి, డయేరియా, రక్త విరేచనాలు అరికట్టడానికి రేగు చెట్ల బెరడును ఉపయోగిస్తారు.
* రేగు ఆకులను నూరి శరీరంపై కురుపులు, పుండ్లు ఉన్నచోట పూస్తే తగ్గుతాయి.
* రేగు పండ్లు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.
* క్యాన్సర్ రాకుండా శరీరానికి తగిన శక్తినిస్తాయి.
* రేగు పండ్లు తినడం వల్ల రక్తం శుభ్రం అవుతుంది.

తల వెంట్రుకలు కూడా రాలవు. 100 గ్రాముల తాజా రేగుపండ్లలో 17 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 10.5 గ్రాముల చక్కెర, 0.60 గ్రాముల పీచు పదార్థం, 0.8 గ్రాముల ప్రోటీన్లు, 81.6 గ్రాముల నీరు, 25.6 గ్రాముల క్యాల్షియం ఉంటాయి. ఇలా ఎన్నో ప్రయోజనాలు కలిగిన రేగు చెట్లు కనుమరుగు కావడం బాధాకరం. బాలలూ.. వచ్చే బాలచెలిమి సంచికలో మరో చెట్టు గురించి తెలుసుకుందాం.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655

## శక్తి రూపాలు




## బొమ్మలేద్దామా...



డి వైష్ణవి
6వ తరగతి, జెడ్‌పిహెచ్ గర్ల్స్ స్కూల్, గంభీరావుపేట.

# పుస్తకం విజ్ఞాన నేత్రం



చరవాణీలు హస్తభూషణమై దేదీప్యమానంగా వెలుగుతున్న ఈ రోజుల్లో పుస్తకం యొక్క ప్రాధాన్యత క్రమక్రమంగా మసకబారుతుంది. మనం సాంకేతికంగా విజయాలు సాధించడానికి హేతువులైన మన మూలాలను విస్మరిస్తున్నాము. పుస్తకం విజ్ఞాన నేత్రం. మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా పుస్తకం తన రూపురేఖలు మార్చుకున్నప్పటికిని యువతరం విపరీత అభిరుచుల కారణంగా అనుకున్న స్థాయిని అందుకోలేక పోతుంది.

పుస్తకాలు చదివి తాము ఉన్నత స్థాయి అధిరోహించామని గొప్ప వ్యక్తులు చెప్పిన విజయ గాథలు నేటి విద్యార్థులకు రుచించడం లేదు. స్వాతంత్ర పోరాటంలో గ్రంధాలయాలు పోషించిన పాత్ర అద్వితీయమైనది. ఇప్పుడు పోటీ పరీక్షలకు సన్నద్ధమయే అభ్యర్థులు తప్ప ఇతరులు గ్రంధాలయాల దరిదాపులకు రావడం లేదు. ఎవరో కొద్ది మంది ఉత్తమ పాఠకులు ఉండడం వలన ఈ మాత్రమైన గ్రంథాలయాల్లో పుస్తకాలకు ఆదరణ లభిస్తున్నది.

చందమామ, బాల మిత్ర, పంచతంత్ర కథల పుస్తకాలతో ఎదగవలసిన బాల్యం ఆన్ లైన్ వీడియో గేములు, వాట్సప్, ఇన్స్టాగ్రామ్‌లకు బానిసై వెర్రి తలలు వేస్తుంది. పాఠ్య పుస్తకాలు తప్ప కథల పుస్తకాలు అంటే ఏమిటో తెలియని పిల్లలు ఈనాడు ప్రతి చోట ఉన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పదుల రూపాయల్లో జ్ఞానాన్ని బోధించే పుస్తకాలు కొనివ్వడం లేదు కాని ఖరీదైన సెల్ ఫోన్‌లు మాత్రం కొనడానికి వెనుకాడడం లేదు.

పుస్తక పఠనం ఉత్తమ అభిరుచికి నిదర్శనం. ఆదర్శవంతమైన జీవనానికి మార్గదర్శి. ఒకప్పుడు చినిగిన చొక్కాలు తొడిగినా, కొత్త పుస్తకం కొనేవారు. ఇప్పుడు ఎన్నో పుస్తకాలు అందుబాటులో యున్నను వాటిని చాలా మంది చదవడం లేదు. ఎందరో రచయితలు సంవత్సరానికి వందలాది పుస్తకాలు వ్రాసి ఆవిష్కరిస్తున్నారు. ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అయినప్పటికీ పాఠకుల ఆదరణ అంతంత మాత్రమే!


సంస్కృతి, సభ్యత, చరిత్ర, జీవన విధానాలకు దిక్సూచి ఐన పుస్తకాల గౌరవాన్ని పెంచాలి. ప్రతి అక్షరాస్యులు పుస్తకాలు చదవాలి. పుస్తక పఠనం రోజువారీ చర్యలో భాగమవ్వాలి. రేపటి తరానికి విలువైన వారసత్వ సంపద గా పరిగణించే విద్యార్థుల అభిరుచిని చెడు దారుల్లో పయనించకుండా పుస్తక పఠనం వైపు మళ్లించే గురుతర బాధ్యతను ఉపాధ్యాయులు మాత్రమే కాకుండా సమాజ శ్రేయస్సును కాంక్షించే ప్రతి వారు తీసుకున్ననాడు పుస్తకాలకు పూర్వ వైభవం వస్తుంది.

– దుర్గమ్ భైతి
ఉపాధ్యాయులు, సిద్దిపేట, m : 9959007914

కార్టూన్ కథ

# పందెం

రచన : శ్రీనివాస్
బొమ్మలు : టి. గంగాధర్, m :7702037198
మార్చ్ 1991, బాలచెలిమి మాసపత్రిక నుండి...



స్పోర్ట్స్

# నలుగురికి ఖేల్ రత్న... దీప్తి జీవాంజీకి అర్జున




'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న' అవార్డులను కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించి చరిత్ర సృష్టించిన మనూ భాకర్‌తో పాటు చదరంగంలో యువ సంచలనం దొమ్మరాజు గుకేశ్, పారా హైజంపర్ ప్రవీణ్‌కుమార్, హాకీ సారథి హర్మన్‌ప్రీత్ సింగ్‌ను ఖేల్ రత్న అవార్డుకు ఎంపిక చేసింది. వీరితో పాటు 32 మందికి అర్జున అవార్డులు ప్రకటించింది. తెలంగాణ అమ్మాయి, గతేడాది ముగిసిన పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్యం సాధించిన దీప్తి జీవాంజీకి అర్జున దక్కింది. మరో తెలుగమ్మాయి జ్యోతి యర్రాజీ (ట్రాక్ అండ్ అథ్లెటిక్స్) సైతం ఈ జాబితాలో చోటు దక్కించుకుంది. అర్జున అవార్డు సాధించినవారిలో ఏకంగా 17 మంది పారా క్రీడాకారులే ఉన్నారు.

## జూనియర్ వరల్డ్ కప్ రైఫిల్/ఫిస్టల్/షాట్‌గన్‌కు 2025కు ఆతిథ్యం ఇవ్వనున్న భారత్

ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ (ISSF) జూనియర్ వరల్డ్ కప్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్ 2025 ఇండియాలో నిర్వహించనున్నారు. 2023లో భోపాల్‌లో సీనియర్ ప్రపంచ కప్ జరిగింది. ఈ సంవత్సరం ISSF ప్రపంచ కప్ ఫైనల్ ఇండియాలోనే జరిగింది. ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ (ISSF) జూనియర్ వరల్డ్ కప్ సంబంధించి డిసెంబర్ 20 ISSF నుండి NRAI అధికారిక ధృవీకరణ పత్రాన్ని స్వీకరించింది.

గత నెలలో రోమ్‌లో ISSF కార్యనిర్వాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించినట్లు NRAI అధ్యక్షుడు కాళికేష్ నారాయణ్ సింగ్ డియో చెప్పారు. సభ్య సమాఖ్యలు అలాగే ISSF ప్రెసిడెంట్ లూసియానోరోస్సీ భారతదేశం అత్యుత్తమ అంతర్జాతీయ షూటింగ్ పోటీలకు ఆతిథ్యం ఇస్తుందని పేర్కొన్నారు. క్రీడను అభివృద్ధి చేయడంలో సహాయపడుతున్న తీరును ఆయన ప్రశంసించారు. జూనియర్ వరల్డ్ కప్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్ 2025 నిర్వహించడానికి అధికారిక ధృవీకరణ వచ్చినందని తెలిపారు. దేశంలో క్రీడను అభివృద్ధి చేసేందుకు తమ ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. తమ ప్రయత్నాలకు భారత ప్రభుత్వం మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది గత దశాబ్దంలో భారతదేశంలో జరిగిన తొమ్మిదో టాప్ లెవల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ అయితే మొదటి ISSF జూనియర్ ప్రపంచ కప్ అని వివరించారు. గతంలో భారతదేశంలో కాంటినెంటల్ ఛాంపియన్‌షిప్‌లు, ఆరు ISSF పోటీలు జరిగాయి. ఇందులో నాలుగు సీనియర్ ISSF ప్రపంచ కప్‌లతో పాటు రెండు ప్రపంచ కప్ ఫైనల్ పోటీలు ఉన్నాయి.

# చెస్ నెట్‌వర్క్ తెలంగాణలో 15,000 చెస్‌బోర్డులను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది




చెస్ నెట్‌వర్క్ తెలంగాణలో 15,000 చెస్ బోర్డులను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమం కేరళలోని మారొట్టిచాల్ అనే గ్రామం నుంచి స్ఫూర్తి పొంది ప్రారంభించబడింది, అక్కడ 100% చెస్ సాక్షరత సాధించడం జరిగింది మరియు సామాజిక సమస్యలను స్థానిక ప్రయత్నాల ద్వారా అధిగమించారు. ఈ ప్రచారం గ్రామీణ మరియు అర్ధపట్టణ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని, చెస్‌ను గ్రామీణ జీవన శైలిలో భాగం చేయడం కోసం ప్రారంభించబడింది.

ప్రచారం లక్ష్యం: ఈ కార్యక్రమం ముఖ్యంగా వరంగల్ జిల్లా వంటి గ్రామీణ ప్రాంతాలను లక్ష్యంగా చేస్తోంది, అక్కడ యువతలో సానుకూల ప్రవర్తనను ప్రోత్సహించడం మరియు మద్యపాన దురవ్యసనాన్ని తగ్గించడం కోసం చెస్‌ను ఒక సాధనంగా ఉపయోగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రధాన కార్యక్రమాలు: 2024 డిసెంబర్ 28న, చెస్ నెట్‌వర్క్ మరియు ఫుట్‌ప్రింట్స్ అండ్ పేజెస్ అనే లాభాపేక్ష రహిత సంస్థ కలిసి రంగారెడ్డి జిల్లాలోని మడ్గుల్ మరియు ఇర్విన్ మండలాల్లో 100కుపైగా చెస్ బోర్డులను ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌ప్రింట్స్ అండ్ పేజెస్ అధ్యక్షురాలు తరిణి నల్లవోలు చెస్ ద్వారా యువ మేధస్సులను వ్యూహాత్మక ఆలోచన, సృజనాత్మకత మరియు జీవిత నైపుణ్యాలను అందించేందుకు అవకాశం ఇస్తుందని పేర్కొన్నారు.

సామాజిక మార్పు: సుధీర్ కొదాటి, చెస్ నెట్‌వర్క్ వ్యవస్థాపకుడు, ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో చెస్‌ను పరిచయం చేయడం ద్వారా సామాజిక మాధ్యమాల వ్యసనాలకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలని మరియు యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని చెప్పారు.

అర్జున్ ఎరిగాట్సికి గౌరవం: ఈ కార్యక్రమం హన్మకొండలో, వరంగల్కు చెందిన చెస్ గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఎరిగాట్సికి గౌరవం పొందిన తర్వాత మరింత ఉత్సాహంగా కొనసాగుతోంది. 2800 ఇలో రేటింగ్‌ను దాటిన రెండవ భారతీయుడిగా, ప్రపంచంలో 4వ స్థానంలో నిలిచిన ఆయన, ఈ ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చారు.

భవిష్యత్తు ప్రణాళికలు: చెస్ నెట్‌వర్క్ ఇప్పటికే దండేపల్లి మరియు వంగర వంటి గ్రామాల్లో చెస్ బోర్డులను పంపిణీ చేసి, ఈ ప్రచారాన్ని ఇతర జిల్లాలకు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కూడా తన మద్దతుతో చెస్ బోర్డులను పంపిణీ చేయడానికి అంగీకరించారు.

ఈ కార్యక్రమం చెస్‌ను సమాజంలోని ప్రతి వర్గానికి చేరవేయడమే కాకుండా, సామాజిక మార్పు తేవడంలో కీలకమైన పాత్ర పోషిస్తుంది.

– సచిన్ కోత్వాల్

బాలచెలిమి, m: 9701001036



# హేమంతపు కాంతి సంక్రాంతి

**తేజ:** తాతయ్యా... ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? దేనిగురించి మాకు చెప్పవచ్చుగా?

**తాతయ్య:** ఏముంది నా ఆలోచన అంతా మీ గురించే మీరు చదివే చదువుల్లో చదువేంత? అన్నదే నా ఆలోచన.

**తేజ:** మీరేం వర్రీ కాకండి తాతయ్యా. నేను నా గైడెన్స్‌లో ఇప్పటి వరకు బాగానే చదివాను ఇకముందు కూడా బాగానే చదువుతాను.

**తాతయ్య:** అంత భరోసా ఇస్తే చాలు నాకు బోలేడు బలం... ఇంతకీ సంక్రాంతి పండగ సెలవులకు ఏ ప్రయాణం ప్లాన్ చేసారు?

**తేజ:** సెలవులు ఏమీలేవు తాతయ్యా పండగ మూడు రోజులేనట ఆ తర్వాత వెంటనే పరీక్షలున్నాయి. చదువుకోవాలి నో టూర్. ఔను తాతయ్య సంక్రాంతి మనకు మూడు రోజులు చేసుకునే పండుగా?!

**తాతయ్య:** సంక్రాంతి మూడు రోజుల పండుగని ఎవరన్నారు? ముప్పై రోజుల పండుగ.

**తేజ:** వావ్!! మూడు రోజులు కాదా? ముప్పై రోజులా?!

**తాతయ్య:** ఔను అందుకే దీనిని పెద్ద పండుగ, పెద్దల పండుగ అని పంటల పండుగ అని కూడా అంటారు.

**తేజ:** కాని మనం ఎక్కువగా సంక్రాంతి అని అంటాం కదా? ఆ పేరు ఎలా వచ్చింది?

**తాతయ్య:** తేజ మన పండుగలకు ప్రకృతితో సూర్యచంద్రులతో సంబంధం ఉంటుంది. ముఖ్యంగా తెలుగు నెలలు, సంవత్సరాలు, ఋతువులు బట్టి మన పండగలు ఉంటాయి.

**తేజ:** ఔను తాతయ్య గతంలో కూడా కొన్ని పండుగలు గురించి చెబుతూ అదే చెప్పావు... సరే ఇది ఎలాగో చెప్పు.

**తాతయ్య:** అన్ని తెలుగు పండుగలు లాగే సంక్రాంతి కూడా పౌరాణిక, సామాజిక, ఆరోగ్య సంబంధాలు కలిగి ఉంటుంది. అదనంగా ఈ పండుగ భౌగోళిక సంబంధం కూడా కలిగి ఉంటుంది.

మానవులందరికి ప్రత్యక్షంగా కనిపించే దేవుడైన సూర్యుని పూజించే పండుగ ఇది.

**తేజ:** ఓ... అంటే నన్ను పూజిస్తారన్న మాట (నవ్వుతూ) ఇంతకీ సూర్యునికి ఈ పండుగకు సంబంధం ఏమిటి?

**తాతయ్య:** సాధారణంగా మన తెలుగు పండుగలు అన్నీ తిథులు ఆధారంగా చేసుకుంటాము అంటే ఆయా తిథులు ప్రవేశంతో అన్నమాట. కానీ ఈ సంక్రాంతి మాత్రం సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించిన సందర్భంలో ఈ పండుగ చేసుకుంటాము.

**తేజ:** సూర్యుడు కదలడు కదా తాతయ్య మరి ఎలా ప్రవేశిస్తాడు?

**తాతయ్య:** ఇక్కడ సూర్యుని చుట్టూ తిరిగే భూమి దిశ మారడం అని అర్థం. సూర్యునికి దక్షిణ దిశ నుంచి ఉత్తర్ వైపు భూగ్రహం తన భ్రమణ దిశ మారుతుంది. అందుకే సంక్రాంతి నుంచి రాత్రి సమయం తగ్గి పగటి కాలం పెరుగుతుంది.

తేజ: అలాగా తాతయ్య అంటే సూర్యుని వైపు భూమి దిక్కు మారడం అన్నమాట.

తాతయ్య: వెరీ గుడ్ బాగా గ్రహించావ్ ఇదే విధంగా మనకు గల పన్నెండు రాశుల్లో సూర్యుడు నెలకో రాశిలో ప్రవేశిస్తాడు. సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే రోజునే మనం మకర సంక్రాంతి పండుగ జరుపుకుంటాం.

తేజ: అలా 12 రాశుల్లో సూర్యుడు ప్రవేశిస్తాడు కనుక మనకు నెలకో సంక్రాంతి అన్నమాట?

తాతయ్య: అలా ఏమి కాదు. మకర రాశిలోకి ప్రవేశించే సమయమే భౌగోళికంగా ప్రకృతిపరంగా ప్రత్యేకతలు కలిగి ఉంటుంది.

తేజ: అది నిజమే గాని సంక్రాంతి మూడు రోజుల పండుగ కాదు ముప్పై రోజుల పండగ అన్నావుగా? అది ఎలా?!

తాతయ్య: మకర సంక్రమణానికి ముందు ముప్పై రోజులను 'ధనుర్మాసం' అంటారు. మార్గశిర - పుష్య మాసాల్లో ఈ రోజులు వస్తాయి. మంచు కురిసే హేమంత ఋతువు కాలం ఇది. ఈ ధనుర్మాసంలో చివరి రోజు భోగి పండుగ. పౌరాణికంగా విష్ణు చిత్తుని కుమార్తె గోదాదేవి, తన ఇష్ట దైవం శ్రీకృష్ణుని భర్తగా ఆరాధిస్తూ ముప్పై రోజుల పాటు పాశురాలు, తిరుప్పావై, అనే కీర్తనలతో పూజిస్తూ కాత్యాయని వ్రతం చేసి కృష్ణుని స్వతం చేసుకుందని భావిస్తూ భోగినాడు గోదాదేవి - రంగనాథుని కళ్యాణం చేస్తారు వైష్ణవ భక్తులు.

తేజ: ఈ వ్రతం ఎవరు చేయాలి తాతయ్య?!

తాతయ్య: ముఖ్యంగా పెళ్లి కాని ఆడపిల్లలు చేయాలి. ఈ నెల రోజులు తెల్లవారు ఝామున లేచి స్నానం చేసి ఇంటి ముందు కళ్లాపి చల్లి రంగు రంగుల ముగ్గులతో ముంగిళ్లను అలంకరించి పేడ గొబ్బెమ్మలను బంతిపూలతో అలంకరించి బతుకమ్మ పాటలను పోలిన గొబ్బెమ్మ పాటలను జానపద బాణిలో పాడుతూ ఈ వ్రతం చేస్తారు.

తేజ: హరిదాసులు - గంగిరెద్దుల అవసరం ఏమిటి?

తాతయ్య: ప్రతి పండుగలు దానధర్మాలతో ముడిపడి ఉంటాయి. దానం చేయడం అన్ని విధాల మంచిది. అందుకే ఈ నెల రోజులు జానపద భిక్షకులైన హరిదాసులు గంగిరెద్దులు పగటి వేషాల వాళ్లు జంగం దేవర్లు వారు ఇల్లిల్లు తిరుగుతూ అందరినీ కీర్తిస్తూ అందిన దానాలతో ఉపాధి పొందుతారు.

తేజ: ఈ మూడు రోజుల పండుగలు ఎలా చేస్తారో చెప్పవా?

తాతయ్య: మొదటి రోజు భోగి పండుగ నాడు తెల్లవారు ఝామున నిద్రలేచి అంతక ముందు రోజు ఇళ్లను శుభ్రం చేసి తొలగించిన పాత వస్తువులతో 'భోగి మంటలు' వేసి నువ్వుల నూనె రాసుకుని తల స్నానాలు చేసి కొత్త బట్టలు ధరిస్తారు. విష్ణు మూర్తిని పూజిస్తారు. గోదాదేవి కళ్యాణాలు జరిపిస్తారు. సాయంత్రం పూట చిన్నపిల్లలకు రేగిపళ్లు, చెరుకు ముక్కలు కలిపి భోగిపళ్లు పోస్తారు.

తేజ: రెండవ రోజు సంక్రాంతి కదా? ఆ రోజు ఏమిటి?

తాతయ్య: ఈ రోజు సూర్యోదయానికి గంట సమయం ముందు బ్రహ్మీణి ముహూర్తంలో స్నానాదికాలు పూర్తి చేసి సూర్యునితో పాటు పితృదేవతలను పూజించి నైవేద్యాలుగా పిండి వంటలు భోజన పదార్థాలు అర్పిస్తారు. ఈ రోజు చేసే ప్రతి పనిలో తినే ఆహారంతో ఆరోగ్యం దాగి ఉంటుంది.

తేజ: మరి మూడవ రోజు పండుగను "కనుమ" అని ఎందుకంటారు?

తాతయ్య: జాతరగాని, గ్రహణం, జరిగిన మరుసటి రోజును "కనుమ" అంటాం. సంక్రాంతి రోజు సూర్యుడి సంక్రమణం జరిగింది కనుక మరుసటి రోజును కజనుమ పండగగా భావించి రైతులు తమ పంటలు అన్ని పుష్కలంగా పండి ఇంటికి పంటలన్నీ లక్ష్మీ రూపంలో వచ్చిన సంతోషంతో ఈ పండగ జరుపుతూ తమ పంటల వ్యవసాయానికి సాయపడ్డ పశువులను వ్యవసాయ పనిముట్లను శుద్ధి చేసి అలంకరించి పూజిస్తారు.

తేజ: అంటే ఈ సంక్రాంతి పండగ మొత్తం ప్రకృతికి ఆరోగ్యానికి సంస్కృతికి సంబంధం ఉంది. కనుమ నాడు పెట్టే బొమ్మల కొలువు ఉపయోగం ఏమిటి తాతయ్య?

తాతయ్య: బాగా గుర్తు చేసావు బొమ్మల కొలువులో పురాణ పాత్రలు కులవృత్తి సంస్కృతుల బొమ్మలు ద్వారా మన సంప్రదాయాలు పరిచయం చేయడం, స్నేహ భావం పెంచడం ఐక్యమత్యంలోని బలం చాటటం.

తేజ: చాలా కొత్త విషయాలు తెలిసాయి బై తాతయ్య.

- డా. అమ్మిన శ్రీనివాసరాజు
m : 7729883223

కథ

# మాషా - ఎలుగుబంటి

ఇరినా జిలెంజ్నోవా



అనగనగా ఓ ఊరిలో ఒక అమ్మమ్మ, తాతయ్య ఉండేవారు. వారికి ఒక్కగానొక్క మనవరాలు. ఆ పాప పేరు 'మాషా'.

ఓ రోజు మాషా స్నేహితులంతా అడవిలోకి వెళ్ళి పుట్టగొడుగులు, బెర్రీలు ఏరుదామనుకున్నారు. 'నువ్వు వస్తావా మాతో?' అని అడిగారు మాషాని.

"ప్రియమైన తాతయ్య, అమ్మమ్మా! స్నేహితులంతా అడవికి వెళ్తున్నారు. దయచేసి నన్ను కూడా అడవికి పంపండి" అని ప్రాధేయ పడింది, చిన్నారి మాషా.

వాళ్ళు ఒప్పుకున్నారు. "అడవిలో స్నేహితురాళ్ళని విడిచి దూరంగా వెళ్ళొద్దు. అలా వెళ్ళావో నువ్వు తప్పి పోతావు. ఎప్పటికీ ఇల్లు చేరలేవు" అని జాగ్రత్తలు చెప్పారు.

మాషా, స్నేహితురాళ్ళు ఊరి పక్కనున్న దట్టమైన అరణ్యంలోకి వెళ్ళారు. చెట్టూ, పుట్టా గాలిస్తూ పుట్టగొడుగులూ, బెర్రీలు ఏరటం మొదలు పెట్టారు. ఈ క్రమంలో మాషా తన స్నేహితులకి దూరంగా అడవి లోపలికి వెళ్ళిపోయింది. ఆ విషయం మాషా గ్రహించలేదు.

కొద్దిసేపటికి చుట్టూ చూసింది మాషా. చుట్టుపక్కల ఎవరూ లేరు. తన స్నేహితురాళ్ళు కోసం బిగ్గరగా పిలిచింది. సమాధానం లేదు. మాషాకు భయం వేసింది. అడవిలో ఎంత వెతికినా తన స్నేహితురాళ్ళు కనిపించలేదు. వాళ్ళ జాడ కూడా లేదు. ఇంటికి తిరిగి వెళ్లామని ప్రయత్నించింది. కానీ దురదృష్టవశాత్తు ఇంటికెళ్ళే దారి మర్చిపోయింది. బాధతో కన్నీరు కార్చింది మాషా.

అలా నడిచి, నడిచి చివరికి దట్టమైన అరణ్యం మధ్య భాగానికి చేరింది. అక్కడ అడవిగాలి కూడా చొరబడనంత దట్టంగా ఉంది.

ఆశ్చర్యం అక్కడ మాషాకు ఓ గుడిసె కనిపించింది. వెంటనే దాని తలుపు తట్టింది. ఎవరూ ఉలుకలేదు, పలుకలేదు. సరేనని తలుపును నెట్టింది. ఆ తలుపుకు లోపల గడియ వేయలేదు, కాబట్టి అది మెల్లగా తెరుచుకుంది.

మాషా ఇంటి లోపలికి వెళ్ళి కిటికీ వద్ద కూర్చుంది. "ఎవరుంటారబ్బా ఈ ఇంట్లో " అని ఆలోచించసాగింది.

ఆ ఇంట్లో ఓ పెద్ద ఎలుగుబంటి నివసించేది. అది కొద్దిసేపటి క్రితం షికారుకి వెళ్ళింది. పొద్దు గూకింది. ఎలుగుబంటి తన ఇల్లు చేరింది. మాషాను చూసి అది చాలా సరదా పడింది.

"ఆహా! భలేగా దొరికావు ఓ బుజ్జి పాపా! నువ్వు ఈ క్షణం నుండి నా సేవకురాలివి. ఇంటిపని, వంటపని అంతా నువ్వే చూసుకోవాలి. ఏ మాత్రం బద్దకించినా లేదా పారి పోవాలని ప్రయత్నించినా, ఆ రోజే నీ ఆఖరి రోజు గుర్తుంచుకో జాగ్రత్త." అని హెచ్చరించింది ఎలుగుబంటి.

"సరేనండి ఎలుగుబంటిగారూ! మీరు చెప్పినట్లే బుద్ధిగా నడుచుకుంటాను." అంది మాషా.

ప్రతీ రోజు ఉదయం ఎలుగుబంటి ఇంట్లో నుండి బయలుదేరి వేటకు వెళ్ళేది. మాషా ఇంటిని సర్ది, పాత్రలు కడిగి, వంట చేసేది. తిరిగి వచ్చిన ఎలుగుబంటి సుష్టుగా తిని నిద్రపోయేది. ఇది దాని దినచర్య.

ఇలా కొన్ని నెలలు గడిచాయి. మాషాకి తన అమ్మమ్మ, తాతయ్యలని చూడాలని దిగులు పుట్టింది. పారిపోదామంటే దారి తెలియదు తనకి సాయం చేయడానికి ఏ ఒక్క మనిషి దరిదాపుల్లో కూడా లేరు ఎలాగబ్బా? అని ఎంతగానో ఆలోచించింది. చివరికి ఓ పథకం వేసింది.



ఓ రోజు సాయంత్రం ఎలుగుబంటి అడవి నుండి తిరిగి ఇంటికి వచ్చింది. మాషా భోజనం వడ్డించింది. ఎలుగుబంటి సుష్టుగా తిని తేపింది.

మాషా ఇలా అడిగింది. "ఎలుగుబంటిగారూ! ఎలుగుబంటి గారూ!

నన్ను ఒక్కరోజు మా ఊరికి వెళ్ళనివ్వండి. నేను తయారు చేసే రుచికరమైన పిండి వంటలు మా తాతయ్య, అమ్మమ్మలకి ఇచ్చేసి వస్తాను." "కుదరదు" అని కోపంగా అరిచింది ఎలుగుబంటి.

ఓ క్షణమాగి "ఇలా రా" అంది ఎలుగుబంటి. "మాషా! ఓ పని చేద్దాం. నువ్వు రుచికరమైన పిండి వంటలు తయారు చెయ్యి. నేను వాటిని జాగ్రత్తగా మీ తాతయ్యకి, అమ్మమ్మలకి చేరుస్తాను. ఎందుకంటే నువ్వు చిన్నపిల్లవి కదా! అడవిలో తప్పిపోతావు".

తన పథకం పారుతున్నందుకు లోలోపల సంతోషించింది మాషా. కానీ బయటకు మాత్రం గంభీరంగా మొహం పెట్టింది. "సరేనండి, ఎలుగుబంటిగారూ" అంది మాషా.

పెద్ద పళ్ళెం నిండా చక్కటి పిండి వంటలు తయారు చేసింది మాషా. అవి గుమగుమలాడే సువాసనలు వెదజల్లుతున్నాయి. ఎంతో రుచికరమైన పిండివంటలవి. వాటిని వీపుకు తగిలించుకునే తోలు సంచిలో జాగ్రత్తగా సర్దింది.

"ఎలుగుబంటిగారూ! నాదో చిన్న షరతు. మీరు ఈ పిండి వంటల్ని జాగ్రత్తగా మా అమ్మమ్మ, తాతయ్యలకి చేర్చాలి. దారిలో మీకు ఆకలేసినా, సంచి తెరవకూడదు. పిండివంటలు తినకూడదు. నేను ఒక చెట్టుపైకి ఎక్కి అంతా గమనిస్తూ ఉంటాను." అంది మాషా. సరేనంది ఎలుగుబంటి.

"బయటకు వెళ్ళి వర్షం పడుతోందో, లేదో ఓసారి చూసిరండి" అంది మాషా.

ఎలుగుబంటి ఇంటి బయటకు వెళ్ళింది.

ఈలోగా మాషా వీపుకు తగిలించే పెద్ద సంచీలో

జాగ్రత్తగా కూర్చుంది. తన తలపై తినుబండారాలున్న పళ్ళాన్ని పెట్టుకుంది. నిశ్శబ్దంగా కూర్చుంది. తను కనిపించకుండా జాగ్రత్త పడింది.

ఎలుగుబంటి ఇంట్లోకి వచ్చింది. తోలు సంచి భుజానికి తగిలించుకుంది. మాషా వాళ్ళ ఊరి వైపు ప్రయాణం ప్రారంభించింది.

మొదట దేవదారు చెట్లను దాటింది. తరువాత పోప్లార్ చెట్లను దాటింది. కొండను ఎక్కి, దిగింది. అలసి పోయింది. ఎలుగుబంటికి ఆకలి వేసింది.

నేనిప్పుడు విశ్రాంతి తీసుకోకుంటే, చచ్చిపోతాను
ఈ చెట్టుకింద కూర్చుని ఓ లడ్డూ తింటాను”
అని బిగ్గరగా అంది.

తోలు సంచి లోపలి నుండి మాషా ఇలా అంది.

“ఎలుగుబంటి గారూ! ఎలుగుబంటి గారూ!

ఒక చెట్టుపై నుండి నేను అంతా చూస్తున్నాను. మీరు ఇచ్చిన మాట తప్పకూడదు. లడ్డూలు తినకూడదు.

వాటిని మా తాతయ్య, అమ్మమ్మలకి చేర్చాలి.” ఆశ్చర్య పోయింది ఎలుగుబంటి.

“అబ్బా! మాషా ఎంత తెలివైన పిల్ల. ఒక చెట్టుపై కూర్చుని, ఎంతో దూరంలో ఉన్న నన్ను చూడగల్గుతోంది. నా మాటలు వినగలుగుతోంది.” అనుకుంది ఎలుగుబంటి.

సంచి భుజానికి తగిలించుకుని వేగంగా నడవసాగింది. చివరకి మాషా వాళ్ళ ఊరు చేరింది.

చుట్టుపక్కల వాకబు చేసి, మాషా వాళ్ళ ఇంటిని కనిపెట్టింది. “టక్...టక్...టక్...” అని తలుపుని కొట్టింది.

“తలుపు తెరవండి. మాషా మీ కోసం తిను బండారాలు పంపింది” అని బిగ్గరగా అరచింది ఎలుగు బంటి.

ఊరిలోని వీధి కుక్కలు, ఎలుగుబంటి వాసనను కనిపెట్టాయి. మూకుమ్మడిగా గట్టిగా అరుస్తూ ఎలుగు బంటిపై దాడి చేసాయి.

ఎలుగుబంటి బెదిరిపోయింది. భుజానికి ఉన్న సంచిని క్రింద పడేసి, పరుగు లంకించుకుంది. వెనక్కి తిరిగి చూడకుండా అడవిలోకి పారిపోయింది.

పని మీద బయటకు వెళ్ళిన అమ్మమ్మ, తాతయ్యలు ఇంటికి తిరిగి వచ్చారు. “ఏంటీ ఈ సంచి? ” అని అవ్వ అడిగింది.

తాత సంచిని తెరిచాడు. తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు. పిండి వంటల పళ్ళెం తొలగించగానే, అందులో వాళ్ళ మనవరాలు మాషా ఉంది. ఆనందంలో మాషాని కౌగలించుకున్నారు. ముద్దుల వర్షం కురిపించారు. ఆనందబాష్పాలు రాల్చారు. వాళ్ళెప్పటికి సుఖసంతోషాలతో ఆనందంగా ఉన్నారు.

చూశారా పిల్లలూ! ఉపాయం ఉంటే, ఎంతటి అపాయం నుండైనా బయటపడవచ్చు.

**స్వేచ్ఛానువాదం : అనిల్ బత్తుల**

m : 8179273974
ఇంగ్లీష్ : మాషా & ది బియర్
ఇంగ్లీష్ అనువాదం : ఇరినా జెలెంజ్నోవా
బొమ్మ : రచేవ్
రష్యన్ జానపద కథల నుండి

చందదారులుగా చేరండి! బాల చెలిమి చందదారులను చేర్పించండి!

‘ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న ‘బాల చెలిమి’ పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వాహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**
BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balchelimi.com

**చందా వివరాలు :**
విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సం॥లకు : రూ. 750
*‘బాల చెలిమి’ పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**ACCOUNT DETAILS :**
Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

✣ పంచతంత్ర కథలు

# బ్రాహ్మణుడి భార్య – ముంగిసల కథ

పూర్వం అధిష్ఠానం అనే నగరంలో ఒక పేద బ్రాహ్మణుడు తన భార్య కుమారులతో నివసించేవాడు. వాళ్ళ ఇంటిలో ఒక ముంగిస ఉండేది. ఆ ముంగిసను ఆ బ్రాహ్మణుని భార్య చాలా ప్రేమతో చూసేది.

ఒకసారి ఆ ఇల్లాలు పసివాడైన తన కొడుకుని ఉయ్యాలలో ఉంచి నీళ్లు తేవడం కోసం బిందెతో నది దగ్గరికి వెళ్ళింది. ఎంతైనా ఆ ముంగిస జంతువు కదా! అది పిల్లవాడికి హాని చేస్తుందేమోనన్న భయం ఆమెకు ఉండేది. తన భర్తతో ముంగిస పిల్లవాడి దగ్గరకు వెళ్ళకుండా చూడమని చెప్పింది. కానీ ఆ విషయాన్ని మరచిపోయిన బ్రాహ్మణుడు, పట్టణంలో భిక్షకు వెళ్ళిపోయాడు.

కొంత సేపటికి అక్కడికి ఒక పాము వచ్చింది. వెంటనే ముంగిస దాన్ని పట్టుకుని చీల్చివేసింది. దాని మూతి, శరీరం నిండా రక్తం మరకలు అయ్యాయి. ఆ ముంగిస ఇంటి వాకిలిలో బ్రాహ్మణుని భార్య కోసం ఎదురు చూస్తూ నిలబడింది.

నీటిబిందెతో ఇల్లు చేరిన బ్రాహ్మణుని భార్య ముంగిస నోటికి ఉన్న రక్తపు మరకలు చూసింది. ముంగిస తన కుమారుణ్ణి చంపింది అని అనుకుంది. పట్టలేని కోపం వచ్చి నీటిబిందెతో ముంగిసను కొట్టింది. ముంగిస చచ్చిపోయింది. తర్వాత బ్రాహ్మణుడి భార్య ఇంటిలోకి వెళ్ళి చూసింది. ఆమె కుమారుడు క్షేమంగా ఉయ్యాలలో ఆడుకుంటున్నాడు. వచ్చిన పాము రక్తపు మడుగులో పడి ఉంది. అకారణంగా తాను ముంగిసను చంపానని ఆమె ఎంతగానో బాధపడింది.



**నీతి : తొందరపాటుతో ఏ పనీ చెయ్యరాదు. క్షణికమైన ఆవేశమే అన్ని అనర్థాలకు మూలం.**

సేకరణ : అమరావతి


✣ పంచ భూతాలు

## నిప్పు




నిప్పు లేక వంట లేదు
పప్పు లేవి ఉడక లేవు
నిప్పు మేలు మరువ లేము
తాక కుండ వాడు కొనుము
నిప్పు కేమొ చెదలంటవు
నిప్పు లాగ నీవుండుము

– బెలగాం భీమేశ్వరరావు
m : 99895 37835




# షీరోస్
## పుస్తకావిష్కరణ




22 డిసెంబరు 2024న హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో జరిగిన SHEROES పుస్తకా విష్కరణ కార్యక్రమం సామాన్యంగా జరుగే పుస్తక విడుదల కార్యక్రమాలను మించినది. ఈ కార్యక్రమంలో వక్తలు, రచయితలు, ప్రేక్షకులు కలిసి 256 ధీర వనితల జీవితాల ప్రేరణను ప్రదర్శించారు.

ఈ పుస్తకం డాక్టర్ శివ ఆర్ జాస్తి మరియు అహల గారు రచించారు. ఈ పుస్తకం ఆంగ్లంలో 2024 జనవరిలో విడుదల కాగా, ప్రస్తుతం వంగపల్లి పద్మ గారు దీన్ని తెలుగులోకి అనువదించి విడుదల చేశారు. ఇందులో 256 మంది మహిళల విజయాల గురించి సంక్షిప్తంగా వివరించబడింది, వీరు సాధించిన గొప్ప లక్ష్యాలు నేటి యువతలో ప్రేరణ కలిగించేలా పుస్తక రచయితలు ప్రయత్నించారు.

ఈ పుస్తకానికి బాబు దుండ్రపల్లి గారు రూపొందించిన బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ బొమ్మలు SHEROES పాత్రలను కళాత్మకంగా ప్రతిబింబించి పుస్తకానికి అద్భుతమైన అందాన్ని చేకూర్చాయి. ప్రత్యేకంగా 100 మంది SHEROES ను గుర్తించి, మరో సంచికలో చేర్చాలని నిర్ణయించారు.

మొత్తం 350 మంది బాలికలు SHEROES పాత్రల ఏకపాత్రాభినయాలు చేశారు, వారిలోని ప్రతిభను గుర్తించడం మరియు వారిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమంలో ముఖ్యమైన భాగం. 8 గదుల్లో 40 మంది చొప్పున ప్రదర్శనలు ఇచ్చిన బాలికలను 16 మంది జడ్జీలు పరిశీలించి ఉత్తమ ప్రదర్శనలు ఎంపిక చేసి, వారిని సభలో ప్రజ్ఞాపరిచయ పరచారు.

మధ్యాహ్నం సమయంలో ఈ పుస్తకంలోని కొన్ని SHEROES అయిన ఉషా ముళ్ళపూడి, శ్యాల తాళ్లూరి, వంగపల్లి పద్మ, ఓల్గా వంటి వారితో పుస్తక ఆవిష్కరణ నిర్వహించారు. 350 బాలికలకు జ్ఞాపికలు మరియు ప్రశంసా పత్రాలు అందించడం జరిగింది.

ప్రముఖ విద్యావేత్త CA ప్రసాద్ గారు ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ముఖ్యమైన పాత్ర పోషించారు. వారు పాల్గొన్న బాలికలు మరియు వారి తల్లిదండ్రులను సమన్వయించి, ఈ అద్భుతమైన కార్యక్రమం సాధ్యమయ్యేలా చేశారు. NRIVA నుండి పందిరి శ్రీనివాస్ గారు కూడా సమన్వయ కర్తగా చక్కగా వ్యవహరించారు.

ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. పాఠశాల అధినేత వేదకుమార్ గారు వేదికగా ఇచ్చినందుకు పుస్తక రచయితలు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమం విద్య, ప్రేరణ, సమాజ సేవ మరియు కృషి యొక్క గొప్ప ఉదాహరణగా నిలిచింది.

– బాలచెలిమి డెస్క్

# స్కూళ్లలో కోడింగ్‌ను ఎందుకు ప్రవేశపెట్టారు?



**స్కూళ్లలో కోడింగ్‌ను ఎందుకు ప్రవేశపెట్టారు? ఇది విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎలా సహాయపడుతుంది?**

ఇటీవలి సంవత్సరాలలో, కోడింగ్ ప్రపంచవ్యాప్తంగా పాఠ్య పుస్తకాలలో ముఖ్యమైన భాగంగా మారింది. టెక్నాలజీపై ఆధారపడుతున్న సమాజంలో, యువ విద్యార్థులకు చిన్న వయసులోనే కోడింగ్ స్కిల్స్ నేర్పించడం అవసరమని తెలుసు కుంటున్నారు. కానీ, కోడింగ్‌ను స్కూళ్లలో ఎందుకు ప్రవేశ పెట్టారు? ఇది విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎలా ఉపయోగ కరంగా ఉంటుంది? మరియు కోడింగ్ నేర్చుకుంటున్న విద్యార్థుల భవిష్యత్తు ఎలా ఉంటుందో చూద్దాం.

**కోడింగ్‌ను స్కూళ్లలో ఎందుకు ప్రవేశపెట్టారు?**

1. **డిజిటల్ భవిష్యత్తుకు సిద్ధం చేయడం:** టెక్నాలజీ జీవితంలోని అన్ని రంగాలలో ప్రవేశించడంతో, కోడింగ్ ఒక ప్రత్యేకమైన నైపుణ్యం కాకుండా పునాది విద్యగా మారింది. ఇది విద్యార్థులను ఆధునిక టెక్నాలజీకి అనుకూలంగా సిద్ధం చేస్తుంది. 2. **సమస్యలను పరిష్కరించడంలో నైపుణ్యం:** కోడింగ్ విద్యార్థులను సమస్యలను చిన్న చిన్న భాగాలుగా విభజించి, వాటికి దశలవారీగా పరిష్కారాలను కనుగొనడంలో సహాయ పడుతుంది. ఇది తార్కిక ఆలోచనను పెంచి, వివిధ విషయాలలో ఉపయుక్తంగా ఉంటుంది. 3. **సృజనాత్మకతను ప్రోత్సహించడం:** కోడింగ్ ద్వారా విద్యార్థులు సొంతంగా ప్రోగ్రాములు, గేమ్స్ లేదా అప్లికేషన్లు రూపొందించ వచ్చు. ఇది విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందిస్తుంది. 4. **భవిష్యత్తు కెరీర్‌కి సిద్ధం చేయడం:** కోడింగ్ టెక్ పరిశ్రమలో అనేక ఉద్యోగ అవకాశాలకు గేట్వే అవుతోంది. పాఠశాల నుండి కోడింగ్ నేర్చుకోవడం వారి కెరీర్‌కు పునాది వేస్తుంది.

**కోడింగ్ విద్యార్థులకు ఎలా సహాయపడుతుంది?**

1. **కంప్యూటేషనల్ ఆలోచన:** కోడింగ్ విద్యార్థులకు పెద్ద సమస్యలను చిన్న చిన్న దశలుగా విభజించి పరిష్కరించడంలో సహాయపడుతుంది. ఇది విద్యార్థుల ఆలోచనా విధానాన్ని మెరుగు పరుస్తుంది. 2. **అకాడమిక్ ప్రదర్శనను మెరుగుపరచడం:** కోడింగ్ ద్వారా విద్యార్థులు గణితం, విజ్ఞానం వంటి సబ్జెక్టులలో మెరుగైన ప్రదర్శన చూపగలరు. 3. **ఆత్మవిశ్వాసం పెంపొందించడం:** కోడింగ్ సమస్యలను స్వయంగా పరిష్కరించడంలో సహాయ పడుతుంది. ఇది వారికి స్వతంత్రంగా ఆలోచించగలిగే స్థితిని అందిస్తుంది. 4. **టీమ్ వర్క్:** కోడింగ్ ప్రాజెక్టులు తరచుగా బృందాలుగా చేయడం ద్వారా, విద్యార్థులు కమ్యూనికేషన్, సహకారం, నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటారు.

**కోడింగ్ ఉపాధ్యాయులకు ఎలా సహాయపడుతుంది?**


1. **ఉత్సాహవంతమైన పాఠ్యాలు:** కోడింగ్ పాఠ్యాలను మరింత ఉత్సాహవంతంగా మార్చే సామర్థ్యం కలిగి ఉంది. ఇది విద్యార్థులలో తరగతి పట్ల ఆసక్తిని పెంచుతుంది. 2. **మల్టీడిసిప్లినరీ పాఠాలు:** కోడింగ్ గణితం, విజ్ఞానం, కళలు వంటి వివిధ సబ్జెక్టులలో ఉపయోగించవచ్చు. దీని ద్వారా విద్యార్థులు విభిన్న రంగాలలో కోడింగ్ ప్రాముఖ్యతను అర్థం చేసుకుంటారు. 3. **ఆధునిక బోధనా విధానాలు:** కోడింగ్ ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులను ఆధునిక విద్యా విధానాలకు సిద్ధం చేయగలరు.

**కోడింగ్ నేర్చుకున్న విద్యార్థుల భవిష్యత్తు**

1. **పెరిగిన ఉద్యోగ అవకాశాలు:** టెక్నాలజీ రంగంలో కోడింగ్‌కి సంబంధించిన నైపుణ్యాల ఉన్నత స్థాయి ఉద్యోగాలు విస్తరిస్తున్నాయి. కోడింగ్ నేర్చుకున్న విద్యార్థులు AI, రోబోటిక్స్ వంటి విభాగాలలో శాస్త్రీయ అవకాశాలు పొందవచ్చు. 2. **వ్యాపారాత్మక శక్తి:** కోడింగ్ ద్వారా విద్యార్థులు స్వయంగా అప్లికేషన్లు, వెబ్‌సైట్లు రూపొందించ గలరు, ఇది వారిలో వ్యాపారత్మక ఆలోచనలను పెంచుతుంది. 3. **భవిష్యత్తు ఆవిష్కర్తలు:** కోడింగ్‌ను చిన్న వయసులోనే నేర్చుకోవడం ద్వారా, విద్యార్థులు భవిష్యత్తులో సమస్యలను పరిష్కరించడంలో ముందుండగలరు. 4. **అడాప్టబిలిటీ:** టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతుంది. కోడింగ్ నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటారు మరియు కొత్త పరిజ్ఞానాలను సులభంగా అర్థం చేసుకోవచ్చు.

**ముగింపు**

కోడింగ్ విద్యార్థులకు మాత్రమే కాకుండా ఉపాధ్యాయులకు కూడా సహాయపడుతుంది. కోడింగ్ ద్వారా విద్యార్థులు భవిష్యత్తు టెక్నాలజీ ప్రపంచానికి సిద్ధం అవుతారు.




# మంచి స్నేహం

అనగనగా ఒక అడవిలో ఏనుగు మరియు కుందేలు ఉండేవి. ఒకరోజు కుందేలు ఇంటి తలుపు దగ్గర పెద్ద చెట్టు పడి ఉన్నది. అది చూసి కుందేలు చిన్న త్వరలో నుంచి బయటకు వచ్చింది. ఇంటికి అడ్డంగా పడి ఉన్న చెట్టును చూసి ఇప్పుడు నేనేం చేయాలి అని అనుకుంటే అక్కడికి ఏనుగు వచ్చింది.

'ఏం జరిగింది?' అని ఏనుగు కుందేలును అడిగింది. కుందేలు బాధతో 'నా ఇంటికి అడ్డంగా పడ్డ ఈ చెట్టును నీ బలంతో తీసి పక్కకు పెట్టవా!' అని అడిగింది. ఏనుగు వెంటనే తన తొండంతో ఆ చెట్టును తొలగించి పక్కకు పడవేసింది. అప్పటి నుంచి ఏనుగు కుందేలు స్నేహితులయ్యాయి.

నీతి : **ఒకరు ఆపదలో ఉన్నప్పుడు ఇంకొకరు సహాయం చేయాలి**

- ఎం. ఠాగూర్
జెడ్పిహెచ్ఎస్ తాటికల్, నల్గొండ జిల్లా
m : 9440732 392

## కవిత




అక్షరాల వెలుగులో
అజ్ఞానం తుడుచుకో!
అంతులేని ఆనందము
జీవితాన నింపుకో!

పుస్తకాల పఠనంతో
మస్తకం వెలిగించుకో!
మహనీయుల స్ఫూర్తితో
ఆశయాన్ని చేరుకో!

సత్సంబంధాలతో
సమాజాన వెలిగిపో!
సత్కార్యాలతోటి
జనం మదిలో మిగిలిపో!

కీర్తినిచ్చు పనులతో
చరిత్రలో ఉండిపో!
స్ఫూర్తినిచ్చు పలుకులతో
మహాత్ముల్లో చేరిపో!

– గద్వాల సోమన్న
ఎమ్మిగనూరు, కర్నూలు
m : 9966414580

బాలచెలిమి క్లబ్

## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

**చెలిమి క్లబ్**

పేరు : ------------------
తండ్రి పేరు : ------------------
పుట్టినతేదీ : ------------------
చిరునామా : ------------------
------------------
------------------
పిన్ : ------------------
హాబీలు : ------------------
మొబైల్ : ------------------
ఇ-మెయిల్ : ------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com






# సముద్రం - నూనెబుడగ

సముద్రం అలలతో ఎగిసి పడుతోంది. తనలో అన్నీ రకాల జీవులు జీవిస్తున్నాయి. ముత్యాలు, రత్నాలు, పగడాలు అన్నీ తన కడుపులో నుంచే ఉద్భవిస్తాయి. దేన్నైనా తనలో కలిపేసుకుంటుంది. ఎంత పెద్ద వస్తువైనా సముద్రంలో మునిగిపోవాల్సిందే. ఆకాశాన్నంటే శిఖరమైనా సముద్రంలో నిలబడితే ఆనవాలు లేకుండా పోతుంది. లావా వెదజల్లే అగ్ని పర్వతమైనా సముద్రం దగ్గరకొస్తే నోరు మూసుకుని కూర్చోవాల్సిందే. ఎంత పొడుగున్న చెట్టైనా సముద్రపు లోతులో ఉక్కిరిబిక్కిరవ్వాల్సిందే. ఇవన్నీ చూసుకొని సముద్రానికి గర్వం పెరిగి పోయింది. 'ఈ విశాల విశ్వంలో నాలో మునిగిపోనిది ఏదీ లేదు' అని అనుకుంటుంది. ఒక రోజు భూమితో మాట్లాడుతున్నపుడు తన గొప్పదనాన్ని చూపించింది. "నువ్వో చిన్న మట్టి బెడ్డవి. నీకు చుట్టూతా నేనే ఆవరించి ఉన్నాను. అనంత విశ్వంలో మూడు వంతులు నేనుంటే కేవలం ఒక వంతు మాత్రమే నువ్వున్నావు" అంటూ చులకన చేసి మాట్లాడింది. భూమాతకు సహనం ఎక్కువ కదా! నవ్వి ఊరుకుంది. ఆ నవ్వు చూసి సముద్రానికి అహం దెబ్బ తిన్నది. 'ఏమిటీ భూమి, నా గొప్పదనాన్ని చూసి భయపడకుండా నవ్వుతుంది' అని అనుకుని. "ఏంటీ నవ్వుతున్నావు. నా గొప్పదనం చూస్తావా?" అంటూ కొద్దిగా ముందుకు వచ్చి చూపించింది. "చూశావా! నేను అనుకున్నానంటే నిన్ను ఒక్క క్షణంలో ముంచేస్తాను. నేను దేన్నైనా మునిగేలా చేయగలను. అంటూ కాలుదువ్వి మీది మీదికి వచ్చింది. అయినా భూమి ఏమాత్రం తొణకలేదు బెణకలేదు. చిరునవ్వు చెదరనూ లేదు "సముద్రమా! దేన్నైనా మునిగేలా చేస్తాను అంటున్నావు గదా! నన్ను కూడా క్షణంలో ముంచేస్తానన్నావు గదా! నన్ను తర్వాత ముంచేద్దువు గానీ, నేనొకర్ని పంపిస్తా... ముందు వాళ్ళని ముంచేసెయ్ చూద్దాం" అన్నది భూమి. సముద్రం పెద్దగా పగలబడి నవ్వింది. "నాకే పరీక్ష పెడుతున్నావా? నాతోనే పరాచికాలా? ఎవరిని పంపిస్తావో పంపించు. నా ముందు ఎవరైనా తలవంచాల్సిందే. నేనెలా ముంచేస్తానో చూడు?" అన్నది సముద్రం. భూమి "పంపిస్తాను. ఎలా ముంచేస్తావో చూస్తాను" అంటూ ఒక నూనె బిందువును సముద్రంలోకి పంపింది. ఆ నూనె బుడగ సముద్రం మీద తేలుతూ వెళుతోంది.

సముద్రం బుడగను చూసి విరగబడి నవ్వి "ఏదో కొండనో, కోననో పంపిస్తావనుకుంటే ఇంత చిన్న నూనె బిందువును పంపుతావా. ఇప్పుడే ముంచేస్తానంటూ" సముద్రం అలల్ని పెంచింది కానీ నూనె బిందువు మునగ లేదు. ఇంకా పెద్ద పెద్ద అలల్ని తెచ్చింది. కానీ నూనె బిందువు మునిగి పోలేదు. సముద్రానికి పంతం ఎక్కువై నీళ్ళను ఎత్తుకు లేపి బిందువు మీద పోసినా అది మునగట్లేదు. ఎంతసేపు ప్రయత్నించినా నూనె బిందువు తేలుతూనే ఉన్నది. సముద్రం నూనె బిందువును కిందికి తోస్తూనే ఉంది చివరికి సముద్రం అలిసిపోయింది. కానీ నూనె బుడగ మునగలేదు నీళ్ళపై తేలుతూనే ఉంది.

- డా. కందేపి రాణీప్రసాద్
m : 9866160378

పాట





# మన జెండా

మువ్వన్నెల జెండా
ముచ్చటైన జెండా

వీరుల త్యాగాల
మహిమాన్విత జెండా
భరతమాత పాదాలకు
పారాణి మన జెండా





సస్యశ్యామల భారత
పుడమితల్లి మన జెండా
పచ్చని పైరుల గురుతుగ
నింగికెగురు మన జెండా

శాంతి సహన మూర్తిగా
వెలిగెడి మన జెండా

దేశ కీర్తి పతాకమై
జగతినేలు మన జెండా

స్వాతంత్ర్యపు గణతంత్రపు
ఘన చరితకు గురుతుగా
కాంతిపుంజమై వెలిగిన
త్యాగదీప్తి మన జెండా

దేశ ప్రగతి పథమునకై
ప్రతి ఇంట మన జెండా
ప్రతి హృదిలో దేశభక్తి
స్ఫూర్తినింపు మన జెండా

– డా. నమిలకొండ సునీత
m : 9908468171







# బట్టతల డేగ

1782 నుండి బట్టతల డేగ (Bald Eagle) యునైటెడ్ స్టేట్స్ యొక్క జాతీయ పక్షిగా ఉంది. ఈ పక్షి మన దేశం యొక్క గ్రేట్ సీల్ పై కూడా కనిపిస్తుంది, ఇది విస్తరించిన రెక్కలతో ఉన్నట్టు చిత్రీకరించబడింది. ఈ పక్షి అనేక ప్రభుత్వ సంస్థలు, అధికారిక పత్రాలు, డాలర్ల బిల్లులు, అధ్యక్షుని జెండా, ప్రతినిధుల సభ, సైనిక చిహ్నాలు, మరియు ఇతర చిహ్నాలలో ఎక్కువగా కనిపిస్తుంది.

బట్టతల డేగ 1776లో మసాచుసెట్స్ రాగిపై ఒక అమెరికన్ చిహ్నంగా మొదటిసారిగా కనిపించింది. అప్పటి నుండి, ఇది అమెరికా చరిత్రలో ప్రముఖమైన చిహ్నంగా మారింది. అనేక యుఎస్ నాణేలపై, ముఖ్యంగా వెండి డాలర్, హాఫ్ డాలర్, క్వార్టర్ మరియు బంగారం ఈగిల్, హాఫ్ డేగ, క్వార్టర్ డేగ వంటి నాణేలు కనిపిస్తాయి.


1789కి ముందు, అమెరికా కాంగ్రెస్ సభ్యులు జాతీయ చిహ్నం ఏమిటి అన్నదానిపై తీవ్ర వాగ్వాదాలు జరిగాయి. బెంజమిన్ ఫ్రాంక్లిన్, ఈ డేగను జాతీయ పక్షిగా ఎంచుకోవడాన్ని వ్యతిరేకించారు. ఆయన ఒక స్నేహితుడికి రాసిన లేఖలో, “బట్టతల డేగ చెడు నైతిక స్వభావం గల పక్షి” అని చెప్పి, టర్కీని ఉత్తమ ఎంపికగా సూచించారు. కానీ, ఈ అభిప్రాయానికి వేరే సభ్యులు సమ్మతించలేదు.

ప్రపంచవ్యాప్తంగా బట్టతల డేగ అనేక జాతీయ చిహ్నాలలో, ప్రత్యేకంగా బలం, ధైర్యం, స్వాతంత్ర్యం మరియు అమరత్వం ప్రతీకగా భావించబడింది. ఇతర ఈగల్స్ నుండి ప్రత్యేకంగా, బట్టతల డేగ ఉత్తర అమెరికాకు చెందిన పక్షి. ఈ పక్షి “ఓల్డ్ అబే” అనే సివిల్ వార్ సైనిక చిహ్నంగా కూడా గుర్తించబడింది.

ఇప్పటి వరకు, బట్టతల డేగ 1940 జాతీయ చిహ్నం చట్టం ప్రకారం రక్షించబడింది. అయితే, పర్యావరణ సమస్యలు, మత్స్యకారులు మరియు రైతుల చేత, ఈ పక్షి జనాభా తగ్గింది. ఇప్పుడు, ఈ పక్షి ఎక్కువగా ఉత్తర అమెరికాలోని ఉత్తర ప్రాంతాలు మరియు ఫ్లోరిడాలోని బ్రీడింగ్ అభయారణ్యాలలో కనుగొనబడుతుంది.

ప్రెసిడెంట్ జాన్ ఎఫ్. కెన్నెడీ, ఈ డేగను జాతీయ చిహ్నంగా ఎంచుకున్నప్పుడు, ఇది అమెరికా బలాన్ని, స్వాతంత్ర్యాన్ని ప్రతీకగా సక్రమంగా సూచిస్తుంది అని చెప్పారు.

– సచిన్ కోత్వాల్
బాలచెలిమి, m: 9701001036



# కలంచెలిమి



**వట్టి కోటి అక్షయ**

10వ తరగతి
జడ్పీహెచ్ఎస్, చిన్న మాదారం,
నల్లగొండ జిల్లా.



**నాయిని లాస్య రెడ్డి**

10వ తరగతి,
జడ్పీహెచ్ఎస్, గిద్దా రామారెడ్డి,
కామారెడ్డి జిల్లా.

**ఎం. లక్ష్మీ నర్సింహా**

9వ తరగతి
జడ్పీహెచ్ఎస్,
పోత్‌గల్



**జి. ఈశ్వర్**

9వ తరగతి, తెలంగాణ ఆదర్శ
పాఠశాల గుర్తూరు, తొర్రూర్ మండలం
మహబూబాబాద్ జిల్లా.





**ఆల్గోట్ భావన**

10 తరగతి,
జడ్పీహెచ్ఎస్,
చిట్టాపూర్.



**పావని**

10 “బి” సెక్షన్, ఇంగ్లీష్ మీడియం
జడ్పీహెచ్ఎస్ చిన్న మాదారం
మండలం : కనగల్లు

# భలే శిష్యుడు




కౌశాంబీ రాజ్యం పొలిమేరల్లో సదానందుడు అనే గురువు ఆశ్రమం ఉండేది. ఎంతో మంది శిష్యులు అక్కడ చేరి విద్యలను అభ్యసించేవారు.

గురువుగారు అప్పుడప్పుడు శిష్యులకు జ్ఞానబోధ చేస్తూ పరీక్షలను పెట్టేవాడు. ఒకసారి గురువుగారు శిష్యులతో “ఒరేయ్! మనం ప్రకృతిని కాపాడాలి. ఈ వాతావరణంలో కాలుష్యం ఎక్కువైంది. ఆ కాలుష్యాన్ని నివారించాలంటే విరివిగా మన మొక్కలను నాటి వాటిని సంరక్షించాలి. అవి పెద్దగా వృక్షాలుగా ఎదిగేంత వరకు మనం ప్రయత్నించాలి” అని అన్నాడు. అందుకు శిష్యులు సరేనన్నారు. కానీ కొన్ని రోజులైనప్పటికీ శిష్యులు ఆ విషయం మరచిపోయి ఆశ్రమ పరిసరాల్లో ఏ ఒక్కరూ మొక్కలను నాటలేదు. గురువుగారికి ఈ సంగతి తెలిసి తిరిగి వారిని మొక్కలు నాటమని చెప్పాడు ఈసారి అందరూ మొక్కలను నాటారు. కానీ ఒక్క జయంతుడు మాత్రం నాటలేదు. ఈ సంగతి గురువుగారికి ఎవరో ఒక శిష్యుడు వెళ్లి రహస్యంగా చెప్పాడు.

మరునాడు గురువుగారు జయంతుని పిలిచి “ఒరేయ్! నేను మీకు మొక్కలను నాటమని గతంలోనే చెప్పాను. కానీ ఎవరూ వాటిని నాటనేలేదు. తిరిగి నేను మళ్లీ నిన్న వాటిని నాటమని చెప్పాను. నిన్న నీవు అందరితో పాటుగా ఒక్క మొక్క కూడా నాటలేదట. నాకు ఈ సంగతి తెలిసింది. ఈరోజు నీ వంతు మొక్కలను నాటు” అని అన్నాడు.

అప్పుడు జయంతుడు “గురువుగారూ! నేను వారితో నిన్న మొక్కలను నాటలేదు. నిజమే. నాకు కొంత అనారోగ్యం కారణంగా నేను ఆ పని చేయలేదు. కానీ మీరు మొదట చెప్పినప్పుడే నేను ఆ మొక్కలను కొన్నింటిని నాటాను. వాటిని సంరక్షిస్తూనే ఉన్నాను. ఆ సంగతి మీకు ఎవరికీ తెలియదు. మన ఆశ్రమానికి కొంత దూరంలో నేను మొక్కలను నాటి వాటికి కంచెలను కూడా ఏర్పాటు చేస్తున్నాను. రేపు అక్కడికి మిమ్మల్ని తీసుకుని వెళ్లి మీకు చూపిస్తాను. కేవలం మొక్కలు నాటడమే కాదు. వాటిని సంరక్షించడం కూడా ముఖ్యమే. నిన్న మన ఆశ్రమాల్లో కొందరు నాటిన మొక్కలను కొన్ని కోతులు వచ్చి పీకి పడేశాయి. అందువల్ల వాటికి కూడా రేపు కంచెలను మిగతా వారితో కలిసి నేను ఏర్పాటు చేస్తాను. మీరు చెప్పినవి తప్పకుండా ఆచరిస్తాను” అని అన్నాడు. గురువుగారు జయంతుని జవాబుకు ఎంతో సంతోషించారు.

మరొకసారి గురువుగారు తన శిష్యులతో “శిష్యులారా! మన రాజ్యంలో కాలుష్యం బాగా ఎక్కువైంది. దానిని అరికట్టడానికి మీరు నడుం బిగించాలి. పర్యావరణం కలుషితం కాకుండా కాపాడకుంటే మనం భయంకరమైన రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతాం. అందువల్ల మీరు

మీ విద్య పూర్తయిన తర్వాత మీ మీ గ్రామాల పెద్దలతో కాలుష్య నివారణ గురించి చెప్పండి. ప్రకృతిలో భాగమైన ఈ గాలి, ఈ నేల, ఈ నీరు కలుషితం కాకుండా చూడండి" అని అన్నాడు. అందుకు శిష్యులు "సరే గురువర్యా! మేము మా గ్రామాలకు వెళ్లిన తర్వాత మీరు చెప్పిన ఈ విషయాలు అందరికీ చెబుతాం" అని అన్నారు. గురువు ఆ మాటలకు సంతోషించాడు.

ఆ తర్వాత మరునాడు జయంతుడు మూడు రోజులుగా తన తోటి శిష్యులకు కనబడకుండా పొద్దున వెళ్లి సాయంత్రం రాసాగాడు. ఆ శిష్యులు గురువు గారితో జయంతుడు మూడు రోజులుగా తమతో ఉండడం లేదని చెప్పారు. అప్పుడు గురువుగారు జయంతుని పిలిచి "జయంతా! నీవు మూడు రోజులుగా పొద్దున వెళ్లి సాయంత్రం వస్తున్నావని మాకు తెలిసింది. ఈ సమయంలో నువ్వు ఎక్కడికి వెళుతున్నావు?" అని ప్రశ్నించాడు. అప్పుడు జయంతుడు "గురువర్యా! నన్ను మన్నించండి. నేను మీరు చెప్పిన దాన్ని ఆచరించడానికి రోజు ఒక గ్రామం వెళు తున్నాను. అక్కడి గ్రామ పెద్దలకు కాలుష్యం వల్ల కలిగే నష్టాలను చెప్పి వారితో పాటు నేను కూడా అక్కడి చెరువులు, కుంటలు, నదులలోని కాలుష్యాన్ని తొలగిస్తున్నాను. ఇలా ఇప్పటికీ మూడు గ్రామాలు కాలుష్యరహితంగా మారాయి. అందుకే మీకు ఎవరికీ కనబడటం లేదు. మీకు చెప్పి వెళ్ళదామంటే మీరు ఆ సమయంలో పక్కనున్న ఏరుకు స్నానానికని వెళ్లారు. ఇక వీరికి చెప్పుదామంటే వీరు కూడా ఆ సమయంలో అందుబాటులో ఉండడం లేదు. అందువల్లనే అలా చేయాల్సి వచ్చింది. మీరు చెప్పిన విషయాన్ని నేను తు.చ తప్పకుండా ఆచరిస్తున్నాను. పొరుగు గ్రామాలకు వెళ్లి కాలుష్యం వల్ల కలిగే నష్టాలను వివరించి వారితో పాటు నేను కూడా ఆ కాలుష్యాన్ని తొలగించుటలో సహకరిస్తున్నాను. ఆ మూడు గ్రామాల అధికారులు మీకు ధన్యవాదాలు తెలిపి మన ఆశ్రమానికి రేపు వస్తానని చెప్పారు" అని అన్నాడు. ఆ మాటలు విన్న గురువు సంతోషంతో " జయంతా! వీరంతా తమ తమ గ్రామాలకు వెళ్లిన తర్వాత ఆ కాలుష్యాన్ని తొలగిద్దామని అనుకున్నారు. కానీ నీవు ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే నా ఉపదేశాన్ని ఆచరణలో పెట్టావు. నీవు కేవలం నీ గ్రామమే కాకుండా ఇతర గ్రామాలకు కూడా వెళ్లి ఆ పెద్దలకు కూడా కాలుష్యం వల్ల కలిగే నష్టాలను తెలిపి వారితో పాటు నీవు కూడా పాల్గొని మాకు పేరు తెచ్చావు. నీలాంటి శిష్యులు దొరకడం మా అదృష్టం. మిగతా శిష్యులు కూడా నీలాగే కేవలం తమ గ్రామాల్లో కాకుండా ఇతర గ్రామాల వారికి కూడా కాలుష్యం వల్ల కలిగే నష్టాలను వివరించి ఆ గ్రామాలను కాలుష్యరహితంగా చేయాలి" అని జయంతుని దీవించాడు. జయంతుడు చేసిన పనికి శిష్యులందరూ కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
ధర్మపురి
m : 9908554535

## బొమ్మలేద్దామా...





మన పర్యావరణాన్ని సంరక్షించకపోతే మన చుట్టూ ఉన్న ప్రపంచం కాలుష్యం బారిన పడుతుంది. కాలుష్యం వలన చుట్టూ ఉన్న చెట్లు, మొక్కలు చనిపోతాయి. అందువలన మనం జీవించడానికి కావలసిన ఆక్సిజన్ కూడా తగ్గిపోతుంది. ఫ్యాక్టరీల వలన గాలి, నీరు కలుషితం అవుతాయి. ఫ్యాక్టరీల నుండి వెలుబడే వ్యర్థాలు నీటిలో కలిసిపోయి. ఆ నీటిని తాగడం వలన అనారోగ్యాల పాలవుతారు. ఫ్యాక్టరీల నుండి వచ్చే పొగ పీల్చుకోవడం వలన ఊపిరితిత్తుల వ్యాధులు వస్తాయి.

పి. వర్షిక
7వ తరగతి, జెడ్‌పిహెచ్, రావలకొలను, సింహాద్రిపురం,
కడప జిల్లా, ఫోన్ : 8978944423




# భారతదేశంలోని 43 యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలు





1972లో స్థాపించబడిన వరల్డ్ హెరిటేజ్ సైట్ యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్(UNESCO) వరల్డ్ హెరిటేజ్ కన్వెన్షన్, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముఖ్యమైన సాంస్కృతిక మరియు సహజ ప్రదేశాలను గుర్తించి సంరక్షిస్తుంది.ప్రపంచంలో అత్యధిక UNESCO వారసత్వ ప్రదేశాలలో భారతదేశం ఆరవ స్థానం. UNESCO భారతదేశంలోని 43 ప్రదేశాలు: 35 సాంస్కృతికమైనవి, 7 సహజమైనవి మరియు 1 మిశ్రమ (సాంస్కృతిక మరియు సహజమైనవి). ఈ ప్రదేశాలలో పురాతన దేవాలయాలు, కోటలు, రాజభవనాలు, గుహలు, జాతీయ ఉద్యానవనాలు మరియు వన్యప్రాణుల అభయారణ్యాలు ఉన్నాయి.

| నెం | సైట్ల పేరు | సంవత్సరం | రాష్ట్రం |
|---|---|---|---|
| 1 | అజంతా గుహలు | 1983 | మహారాష్ట్ర |
| 2 | ఎల్లోరా గుహలు | 1983 | మహారాష్ట్ర |
| 3 | ఆగ్రా కోట | 1983 | ఆగ్రా |
| 4 | తాజ్ మహల్ | 1983 | ఆగ్రా |
| 5 | సూర్య దేవాలయం | 1984 | ఒరిస్సా |
| 6 | మహాబలిపురం స్మారక చిహ్నాలు | 1984 | తమిళనాడు |
| 7 | కజిరంగా నేషనల్ పార్క్ | 1985 | అస్సాం |
| 8 | కియోలాడియో నేషనల్ పార్క్ | 1985 | రాజస్థాన్ |
| 9 | మనస్ వన్యప్రాణుల అభయారణ్యం | 1985 | అస్సాం |
| 10 | గోవా చర్చిలు మరియు కాన్వెంట్లు | 1986 | గోవా |
| 11 | ఖజురహో స్మారక చిహ్నాలు | 1986 | మధ్యప్రదేశ్ |
| 12 | హంపి స్మారక చిహ్నాలు | 1986 | కర్ణాటక |
| 13 | ఫతేపూర్ సిక్రి | 1986 | ఆగ్రా |
| 14 | ఎలిఫెంటా గుహలు | 1987 | మహారాష్ట్ర |
| 15 | గ్రేట్ లివింగ్ చోళ దేవాలయాలు | 1987 | తమిళనాడు |
| 16 | పట్టడకల్ స్మారక చిహ్నాలు | 1987 | కర్ణాటక |
| 17 | సుందర్బన్స్ నేషనల్ పార్క్ | 1987 | పశ్చిమ బెంగాల్ |
| 18 | నందా దేవి & వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ నేషనల్ పార్క్ | 1988 | ఉత్తరాఖండ్ |
| 19 | బుద్ధుని స్మారక చిహ్నాలు, సాంచి | 1989 | మధ్యప్రదేశ్ |
| 20 | హుమాయున్ సమాధి | 1993 | ఢిల్లీ |
| 21 | కుతుబ్ మినార్ & స్మారక చిహ్నాలు | 1993 | ఢిల్లీ |
| 22 | డార్జిలింగ్, కల్కాసిమ్లా & నీలగిరి పర్వత రైల్వేలు | 1999 | డార్జిలింగ్ |

| నెం | సైట్ల పేరు | సంవత్సరం | రాష్ట్రం |
|---|---|---|---|
| 23 | మహాబోధి ఆలయం | 2002 | బీహార్ |
| 24 | భింబేట్కా రాక్ షెల్టర్స్ | 2003 | మధ్యప్రదేశ్ |
| 25 | ఛత్రపతి శివాజీ టెర్మినస్ | 2004 | మహారాష్ట్ర |
| 26 | చంపానేర్ పావగఢ్ ఆర్కియోలాజికల్ పార్క్ | 2004 | గుజరాత్ |
| 27 | ఎర్రకోట | 2007 | ఢిల్లీ |
| 28 | జంతర్ మంతర్ | 2010 | ఢిల్లీ |
| 29 | పశ్చిమ కనుమలు | 2012 | కర్ణాటక, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర |
| 30 | కొండ కోటలు | 2013 | రాజస్థాన్ |
| 31 | రాణి కి వావ్ (క్వీన్స్ స్టెప్వెల్), పటాన్ | 2014 | గుజరాత్ |
| 32 | గ్రేట్ హిమాలయన్ నేషనల్ పార్క్ | 2014 | హిమాచల్ ప్రదేశ్ |
| 33 | నలంద | 2016 | బీహార్ |
| 34 | ఖంగ్చెండ్జోంగా నేషనల్ పార్క్ | 2016 | సిక్కిం |
| 35 | లే కార్బుసియర్ (కాపిటల్ కాంప్లెక్స్) యొక్క ఆర్కిటెక్చరల్ వర్క్ | 2016 | చండీగఢ్ |
| 36 | ది హిస్టారిక్ సిటీ | 2017 | అహ్మదాబాద్ |
| 37 | విక్టోరియన్ గోతిక్ మరియు ఆర్ట్ డెకో సమిష్టి | 2018 | ముంబై |
| 38 | ది పింక్ సిటీ | 2019 | జైపూర్ |
| 39 | కాకతీయ రుద్రేశ్వర (రామప్ప) దేవాలయం | 2021 | తెలంగాణ |
| 40 | ధోలవీర | 2021 | గుజరాత్ |
| 41 | శాంతినికేతన్ | 2023 | పశ్చిమ బెంగాల్ |
| 42 | బేలూర్, హళేబీడ్ మరియు సోమనంతపుర హొయసల దేవాలయాలు | 2023 | కర్ణాటక |
| 43 | మొయిడమ్స్ సమాధులు | 2024 | అస్సాం |



చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

# బాలచెలిమి గ్రంథాలయం

# బాల చెలిమి గ్రంథాలయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఓ వరం..

నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తక జ్ఞానాన్ని అందిస్తూ, భాషను పెంపొందించే క్రమంలో భాగంగా బాల చెలిమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాలు ఎంతో స్ఫూర్తినిస్తున్నాయి. దక్కన్ పత్రిక సంపాదకులు, బాల చెలిమి నిర్వాహకులు మణికొండ వేద కుమార్ గారి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ కార్యక్రమం ఆనాడు జరిగిన గ్రంథాలయ ఉద్యమానికి కొనసాగింపు వంటిది.

వనపర్తి జిల్లా పానుగల్ మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాలకు బాల చెలిమి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినందుకు పాఠశాల తరఫున నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. సుమారుగా 40 వేల రూపాయలు విలువ చేసే వివిధ రకాల పుస్తకాలను అందజేసి, విద్యార్థులలో పుస్తక అభ్యసనాన్ని పెంపొందిస్తూ, వారిలో సృజనాత్మకతను కలిగించేందుకు బాల చెలిమి గ్రంథాలయం ఎంతగానో తోడ్పడుతున్నది.

విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కావడం వల్ల రీడింగ్ పట్ల ఆసక్తిని కోల్పోవడం సహజంగా జరుగుతుంది. బాల చెలిమి గ్రంథాలయం ద్వారా వివిధ కథల పుస్తకాలు, బొమ్మల పుస్తకాలు, పిల్లలకు ఆసక్తి కలిగించే వివిధ రకాలైన పత్రికలు చదవడం ద్వారా వారిలో పుస్తకాల పట్ల ఆసక్తి, చదవాలన్న కోరిక పెరుగుతుంది. తద్వారా విద్యార్థులు తమ తీరిక సమయాన్ని ఇతరత్రా వ్యాపకాలకు ఉపయోగించకుండా పుస్తకాలతో అనుసంధానం కావడానికి ఈ గ్రంథాలయం ఎంతగానో తోడ్పడుతున్నది.

సోషల్ మీడియా విశృంఖలంగా రాజ్యమేలుతున్న ప్రస్తుత రణలో పిల్లలకు పుస్తకాల పట్ల ఆసక్తి కలిగించడం అటు ఉపాధ్యాయులకు, ఇటు తల్లిదండ్రులకు ఎంతో కష్టమైన పని. కానీ పిల్లల అభిరుచులకు తగ్గ పుస్తకాలను అందజేసి క్రమం తప్పకుండా వాటిని చదివేలా ప్రోత్సహిస్తే తమ సమయాన్ని పుస్తక పఠనం వైపు మళ్ళించడం పెద్ద కష్టమేమి కాదనడానికి



బాల చెలిమి గ్రంథాలయం ఒక మంచి తార్కాణం.

సుమారు 350 మంది విద్యార్థులు గల మా పాఠశాలలో బాల చెలిమి గ్రంథాలయం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. తమ లైబ్రరీ పీరియడ్ లోనో లేదా ఇతర లీజర్ పీరియడ్లలోనో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి తమకిష్టమైన పుస్తకాలు తీసుకొని చదవడం ద్వారా రచన వ్యాసంగం పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. చాలామంది విద్యార్థులు తమ అభిప్రాయాలను కవితల రూపంలో, కథల రూపంలో వ్యక్తపరుస్తున్నారు. రేపటి సమాజం గొప్పగా ఉండాలన్నా, సంస్కారవంతమైన సమాజంగా తీర్చిదిద్దబడాలన్నా పాఠశాల స్థాయిలో నేటి పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయడం ఎంతో అవసరం. నేడు బాల చెలిమి గ్రంథాలయాల ద్వారా కొనసాగిస్తున్న బాల సాహిత్య కృషి అభినందించదగినది.

ఇలాంటి గ్రంథాలయాలు రాష్ట్రంలోని ప్రతి మండలానికి కనీసం ఒకటి ఏర్పాటు చేసుకోగలిగితే ఎక్కువమంది విద్యార్థులకు వాటి ఫలితాలు దక్కడం ద్వారా అటు భాష స్పష్టత, ఇటు పుస్తక పఠనం ఏకకాలంలో ఎక్కువమందిలో కలిగించిన వారమవుతాము. ఇప్పటికే ఈ ప్రక్రియలో బాల చెలిమి సారథ్యంలో విశేష కృషి చేస్తున్న నిర్వాహకులు అందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

– సి కిరణ్ కుమార్
బాల చెలిమి గ్రంథాలయ నిర్వాహకులు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పానుగల్, వనపర్తి జిల్లా.
m : 9441016299

## డా.ఎం.హరికిషన్‌కు మంగాదేవి బాలసాహిత్య పురస్కారం



బాల సాహిత్యంలో అత్యంత విశిష్టమైన మంగాదేవి బాలసాహిత్య పురస్కారం కర్నూలు జిల్లా కు చెందిన ప్రముఖ కథ రచయిత డాక్టర్ ఎం. హరికిషన్‌కి డిసెంబర్ 10వ తేదీ గుంటూరులో ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారి చేతుల మీదుగా 25,116 Cash Momento Shawl అందించడం జరిగింది. ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు శ్రీమతి ఎం కృష్ణకుమారి, బాలకుటీర్ నూతన రథసారథి రఘురాం, ప్రముఖ రచయిత వాడ్రేవు చినవీరభద్రుడు గారు ఈ వేడుకలో పాల్గొన్నారు.

## డా.ఎం. హరి కిషన్ గారు రచించిన చిలక ముక్కు చిన్నోడు పుస్తక ఆవిష్కరణ



నవంబర్ 29 పలమనేరు గురుకుల పాఠశాలలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో సాహితీ మిత్రులు పలమనేరు బాలాజీ, శ్రీరామచంద్రమూర్తి, మాధవ రెడ్డి, పుష్ప గార్ల సమక్షంలో సీఐ భాస్కర్ గారు ఆవిష్కరించగా, చిన్నారుల కోసం తెలుగు భాష కోసం నిరంతరం శ్రమిస్తూ ఉన్న మిత్రుడు తులసినాద నాయుడు గారికి పుస్తకాన్ని అంకితం ఇవ్వడం జరిగింది.

## 'ఇంద్రధనుస్సు' పుస్తకావిష్కరణ



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్ ఎస్ కాలనీ, డోను మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్ రాచర్ల, ప్యాపిలి మండలం, నంద్యాల జిల్లా విద్యార్థులు రచించిన ఇంద్రధనుస్సు అను కథా సంకలనం 7.12.2024వ తేదీన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్ ఎస్ కాలనీ, డోను, నంద్యాల జిల్లా పాఠశాల ప్రాంగణంలో గౌరవ శాసన సభ్యులు శ్రీ కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి గారి చేతుల మీదుగా ఆవిష్కరింపబడినది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ తొగట సురేశ్ బాబు, పెద్దలు శ్రీ ఫణిరాజ్, శ్రీధర్ గౌడ్, వలసల రామకృష్ణ, ఎస్ఎంసి చైర్మన్ సుంకన్న పాల్గొన్నారు. ఎం. నాగేశ్వరి, ఎం. పెద్ద జమ్మయ్య, బి.రమ్య శాసన సభ్యుల ద్వారా ప్రత్యేక బహుమతులు, ప్రశంసలు పొందారు.

## ముగ్గురు విద్యార్థుల పుస్తకాలవిష్కరణ



విద్యార్థుల క్రమశిక్షణతో నడుచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ధర్మారం ఏఎస్ఐ మమ్మద్ షబీర్ అన్నారు. ధర్మారం మండల కేంద్రంలోని సాధన జూనియర్ కళాశాల ఆవరణలో ముగ్గురు విద్యార్థులు పోడేటి సమజ్ఞ, ఆస్మిన్, గడ్డం అభిలాష్‌లు రాసిన 'గురువుమాట', 'అక్కాచెల్లెలు', 'తెలుసుకో మిత్రమా' పుస్తకాలను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ

విద్యార్థులు చెడు మార్గంలో పయనించకుండా శ్రద్ధగా చదివినట్లయితే భవిష్యత్తులో వారు ఉత్తమ పౌరులుగా ఎదగడానికి అవకాశం ఉంటుందని అన్నారు. పిల్లల్లో ఉన్న సాహిత్య ప్రతిభను గుర్తించి వారి రచనలను పుస్తక రూపంలో తెచ్చిన తెలుగు ఉపాధ్యాయుడు కందుకూరి భాస్కర్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ గాజనవేణి కుమార్ అధ్యక్షత వహించారు. ప్రస్తుతం డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న చెగ్యాం గ్రామానికి చెందిన పోడేటి సమజ్ఞ రాసిన ఆటవెలది శతకము 'గురువు మాట'ను ప్రముఖ కవి నలుమాసు విజయప్రసాద్ పరిచయం చేయగా, గత సంవత్సరం ఇంటర్ పూర్తి చేసిన జగదేవ్ పేట్ గ్రామానికి చెందిన ఆస్మిన్ రాసిన 'అక్కాచెల్లెలు' పిల్లల కథల పుస్తకంను వుసికమల్ల నారాయణ, నర్సింహుల పల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న గడ్డం అభిలాష్ రాసిన మణిపూసల శతకం 'తెలుసుకో మిత్రమా'ను గుగ్గిళ్ళ నాగభూషణా చారి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవివర్యులు, పద్య సమీక్షకుడు తిప్పారపు లక్ష్మీ నరసయా చార్యులు, ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎలగందుల అశోక్, వివేకానంద డిగ్రీ కళాశాల డైరెక్టర్ దేవి అంజయ్య, ప్రవీణ్, నసీరుద్దీన్, సాగర్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు...

**కందుకూరి భాస్కర్**
తెలుగు ఉపాధ్యాయులు,
జి.ప.ఉ.పా. నర్సింహులపల్లి, పెద్దపల్లి జిల్లా.
CELL: 9441557188

## బాల సాహిత్యం విశిష్టమైనది - నిజామాబాద్ జిల్లా డిఈఓ అశోక్



బాలల్లో సృజన సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఇందూరు జిల్లా బాలసాహిత్య వేదిక చేస్తున్న నిరంతర సేవలు ప్రశంసనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి పి అశోక్ అన్నారు. బాల భవన్‌లో జిల్లాస్థాయి కవితా పోటీల విజేతలైన విద్యార్థులకు బహుమతుల ప్రధాన సభ, డాక్టర్ కాసర్ల నరేశ్ రావు అధ్యక్షత న వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ, బాల సాహిత్యంతో సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షించ బడతాయి.. పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించ బడతాయి.. తద్వారా పిల్లలు మంచి పౌరులుగా తయారవుతారు..

బాల సాహిత్యం వల్ల పిల్లల్లో భావనా శక్తి పెంపొందించబడుతుంది.. ఊహలతో కూడిన రచనలు చేసే పిల్లలు భవిష్యత్తులో ఆ ఊహలు నిజమయ్యేలా తమ జీవితాన్ని మలుచుకునే అవకాశం బాల సాహిత్యం వల్ల కలుగుతుంది.

బాల సాహిత్యంతో పిల్లల్లో సృజనాత్మకత కూడా పెరుగుతుంది.. జిల్లా వ్యాప్తంగా బాలసాహిత్య వేదిక విద్యార్థులకు కార్యశాల నిర్వహించి పోటీలు పెట్టి ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన జిల్లా బాలసాహిత్య వేదిక అధ్యక్షులు డాక్టర్ కాసర్లను ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ శర్మను, కార్యవర్గ సభ్యులైన డాక్టర్ శారద, డాక్టర్ శ్రీమన్నారాయణ చార్య, తంగుడిగి శ్రీనివాస్, కందకుర్తి ఆనంద్, వసంత లక్ష్మణ్‌లను డిఈఓ అభినందించారు. అంతకుముందు బాల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు కథా రచనలో మెలకువలు అనే అంశం మీద ప్రముఖ బాల సాహితీవేత్త డాక్టర్ వి ఆర్ శర్మ ప్రసంగించారు విద్యార్థులను రకరకాల ప్రశ్నలు వేస్తూ వారిలో నటన సృజనాత్మకతను పరిశీలిస్తూ విద్యార్థులకు కథారచనలో మంచి మార్గదర్శనాన్ని అందించారు. కవితా రచన మెలకువలను గరిపెల్లి అశోక్ వివరిస్తూ కవిత్వం రాయడం చాలా గొప్ప విషయమని విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో కవితలను రాసి తమల్ని తాము మెరుగు పరుచుకోవాలని కోరినారు రాష్ట్రవ్యాప్తంగా వందలాది పుస్తకాలు బాలసాహిత్యంలో వస్తున్నాయని నిజామాబాద్ జిల్లా నుంచి కూడా ఇటీవల కాలంలోనే సుమారు 30 పుస్తకాలు వచ్చినాయి అని వారు గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 పాఠశాలల నుండి దాదాపుగా 150 మంది విద్యార్థులు ఈ కార్యశాలలో అలాగే బహుమతి ప్రధాన కార్యక్రమంలో పాల్గొన్నారు 30 మంది ఉపాధ్యాయులు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి తమ విద్యార్థులను తీసుకొని వచ్చి కార్యక్రమంలో

భాగస్వాములైనారు. విజేతలైన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి పి అశోక్ బహుమతులను అందజేశారు. ఈ సభలో వెక్టార్ కళాశాల యజమాని మధుసూదన్ జోషి, టిటియు అధ్యక్షులు లాటికర్ రాము, లక్ష్మీ గణపతి ఆలయం పీఠం వ్యవస్థాపకులు అరుణ్ కుమార్ శర్మ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బి.అమర్నాథ్, కె.బాబు మరియు ఎంతోమంది సాహిత్య అభిమానులు, బాలసాహిత్య వేత్తలు, విద్యార్థులు, యువకులు ఈ సభలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాల్యాన్ని వెలికి తీసిన పుస్తకం కీలు గుర్రం



ప్రముఖ కవి డాక్టర్ ఎన్ గోపి రచించిన కీలుగుర్రం బాలగేయాల సంపుటి ఆవిష్కరణ 7-12-2024 న రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. సభాధ్యక్షులుగా డా పత్తిపాక మోహన్, సాహిత్య అకాడమి బాల సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, దక్షిణ ప్రాంత అధికారి ఎస్ బి టి, ముఖ్య అతిథి, ఆవిష్కర్తగా శ్రీమతి కొల్లూరు స్వరాజం వెంకట రమణమ్మ, బాల సాహితీవేత్త బాల సంపుటి పత్రిక సంపాదకులు విశాఖపట్నం, విశిష్ట అతిథిగా డాక్టర్ భూపాల్ సినీ నటులు, సాహిత్య అకాడమీ బాల సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, డాక్టర్ ఎస్ రఘు కవి,విమర్శకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్,ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆత్మీయ అతిథులుగా చొక్కాపు వెంకటరమణ సాహిత్య అకాడమీ సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, కూరెళ్ళ శ్రీనివాస్, ప్రధాన ఉపాధ్యాయులు, చిత్రకారులు విచ్చేసారు. అబ్దుల్ గని గారు అతిథులను వేదిక మీదికి ఆహ్వానించగా డా పత్తిపాక మోహన్ గారు స్వాగత వచనాలు పలుకుతూ డాక్టర్ ఎన్ గోపి గారు రచించిన కీలుగుర్రం రచన 1965-66 కాలం నాటిదని అప్పుడు రచించిన గేయాలను ఇప్పుడు వెలికి తీసుకురావడం వెనకాల చేసినటువంటి ప్రయత్నాన్ని వివరించారు. పత్తిపాక ఫౌండేషన్ గరిపెల్లి ట్రస్ట్ ద్వారా ఈ పుస్తకం వెలువడింది దీనికి చిత్రాలు కూరెళ్ళ శ్రీనివాస్ గారు అందించారు. దక్కన్ సాహిత్య సభ తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కీలుగుర్రం పుస్తకం ఆవిష్కరణ జరిగింది. తన 15వ యేట రచించిన డాక్టర్ ఎన్ గోపి గారు ఆ బాలగేయాలను గురించి వివరించారు. బాలబాటలో స్వరాజమ్మ గారు ఈ గేయాలను ప్రచురించినందుకు తన కృతజ్ఞతలు అందించారు

పుస్తకానికి ముందు మాట రచించిన డాక్టర్ పత్తిపాక మోహన్ గారు బాల గీతకారుడు డాక్టర్ ఎన్ గోపి అని అభివర్ణిస్తూ 60 ఏళ్ల క్రితం రాసుకున్న బాల గేయాలు అందరికీ తెలియాల్సిన ఆవశ్యకతను వివరించారు.

సినీ నటులు అనేక బాల గేయాలు రచించి బాల సాహిత్య పురస్కారం అందుకున్న డాక్టర్ భూపాల్ గారు ఇందులో ఉన్న గేయాలను కొన్ని పాడి వినిపించారు.

స్వరాజ్యం వెంకట రమణమ్మ గారు కీలుగుర్రం తో పాటు రెక్కల గుర్రం అనే మరొక పుస్తకం రావాల్సిన ఆవశ్యకత ఉందని మీరు మరిన్ని పుస్తకాలు రాయాలని ఆవిష్కర్తగా తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు. బాల గేయాలు నేటి రచయితలకి బాలలకి స్ఫూర్తి దాయకం అన్నారు.

డాక్టర్ ఎస్ రఘు గారు ప్రసంగిస్తూ కీలుగుఱ్ఱం లో ఉన్న 13 బాలగేయాల్లో కొన్ని గేయాలైనా వచ్చే పాఠ్యాంశాలలో చేర్చదగిన గేయాలు ఉన్నాయని చెప్పారు. 15 సంవత్సరాల వయసులోని ఆ భావవ్యక్తీకరణ ఎంత గొప్పగా ఉందో ఈ గేయాలు చదివితే మనకి అర్థం అవుతుందని ఆయన వివరించారు.

చొక్కాపు వెంకటరమణ కీలు గుర్రంలో డా. ఎన్ గోపి గారు రచించిన బాలగేయాలన్ని చక్కని భావ వ్యక్తీకరణ తో ఉన్నాయని ప్రశంసించారు. కూరెళ్ళ శ్రీనివాస్ గారు ఈ పుస్తకానికి బొమ్మలు గీయడం తన అదృష్టంగా భావిస్తూ మరెన్నో పుస్తకాల కి నేను చిత్రాలు గీయడానికి సిద్ధంగా ఉ న్నానని చెప్పారు. గరిపల్లి అశోక్ గారు కార్యక్రమానికి హాజరు కాలేకపోయినా కీలుగుర్రం పుస్తకంలో పుస్తకం బయటకు రావడానికి సహాయం చేసిన ప్రతి ఒక్కరికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆద్యంతం ఆక్తికరంగా జరిగిన కార్యక్రమంలో బాల సాహిత్యం పట్ల ఆసక్తి ఉన్న రచయితలతో పాటు ప్రముఖులు ఎందరో హాజరయ్యారు.

– డాక్టర్ సమ్మెట విజయ

– సచిన్ కోత్వాల్

బాలచెలిమి, m: 9701001036

వ్యక్తిత్వం

# సి. నారాయణరెడ్డి

అక్షరాస్యత కాదు విద్యాగంధం సైతం అంతంత మాత్రంగా వున్న తెలంగాణ జనపదంలో పుట్టి జానపదుల మాట, ఆట, పాటల బడిలో పెరిగి ఇంతింతై ఎదిగి జ్ఞానపీఠాన్ని అధిరోహించినవాడు డా. సి. నారాయణరెడ్డి. ఆయన జీవనగాథ స్ఫూర్తిదాయకమైంది.

1931 జులై 29న కరీంనగర్ జిల్లా సిరిసిల్లా తాలూకా హనుమాజీ పేటలో నారాయణరెడ్డి జన్మించారు. తల్లిదండ్రులు బుచ్చమ్మ, సింగిరెడ్డి మల్లారెడ్డి.

సాహిత్య వాతావరణంలేని కుటుంబ నేపథ్యంలో జన్మించినా, ఉర్దూ మాధ్యమంలో డిగ్రీవరకు విద్యాభ్యాసం చేసినా తెలుగుమూర్తిగా వికసించిన సినారె ఒక అసాధారణ ప్రతిభాశాలి. చిన్నప్పుడు పల్లెప్రజల నిసర్గసుందరమైన సంభాషణా రీతి, జానపద కళారూపాలు నారాయణ రెడ్డిని భాషా సాంస్కృతిక వ్యక్తిత్వాన్ని మలిచాయి. 6,7 తరగతుల్లో వున్నప్పుడే భక్తప్రహ్లాద, సీతాపహరణం, రఘుదేవ రాజకీయం వంటి నాటికలు రాసి మిత్రులతో కలిసి ప్రదర్శించే వారు.



'ఒకనాడు ఒక నక్క ఒక అడివిలోపల' అంటూ సీసపద్యం రాస్తే ఉపాధ్యాయుడు ధూపాటి వెంకట రమణా చార్యులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మరికొన్ని మెలకువలు చెప్పారు. ఇంటర్మీడియెట్‌లో ఉండగా జువ్వాడి గౌతమరావు 'జనశక్తి' పత్రికలో తొలికవిత ప్రచురితమైంది. 21 ఏళ్ళ వయసులో నారాయణరెడ్డి రేడియోతో అనుబంధం ఏర్పడింది. 1952లో బి.ఎ. విద్యార్థిగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు హైదరాబాద్‌లో ఖైరతాబాద్‌లో వున్న దక్కన్ రేడియోలో ప్రసారమైన 'సాగుమా ఓ నీలమేఘమా గగనవీణా మృదు రావమా' అన్న గీతం నారాయణరెడ్డి పరిణత కవిగా ఎదిగేదశలో తొలిమెట్టుగా నిలిచింది. మరియు 'నవ్వని పువ్వు' గేయనాటిక గూడా ప్రసారమైంది.

ఇంటర్ రెండో సంవత్సరంలో ఉండగా రెడ్డి హాస్టల్‌లో జరిగిన అఖిలాంధ్ర కవి సమ్మేళనంలో విద్యార్థి కవిగా పాల్గొన్నారు సినారె. దాశరథితో పరిచయం అదే తొలిసారి.

1952లో బి.ఎ. ఫైనల్ విద్యార్థిగా వున్నప్పుడే తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి కార్యదర్శిగా వున్నారు. సంఘానికి తర్వాత అధ్యక్షుడయ్యారు.

బి.ఎ, ఎం.ఎ. పూర్తి చేసి సికింద్రాబాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా ప్రవేశించారు. నిజాం కళాశాలలో, ఆ తర్వాత ఆర్ట్స్ కళాశాలలో ఆచార్యత్వం, తనకు సాహిత్య విద్యనేర్పిన గురువులు కె. గోపాలకృష్ణారావు, దివాకర్ల వేంకటావధానితో కలిసి ఆచార్యులుగా పనిచేసిన అరుదైన ఖ్యాతి సినారెకు ఆనాడే దక్కింది. ఆయన పాఠాలు విన్న మధురానుభవాన్ని ఈనాటికీ గుర్తుచేసుకొనే విద్యార్థులెందరో! ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షణలో 'ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు' అన్న అంశంపై పీ.హెచ్.డి. చేశారు.

1961లో సినీ గీతరచన ప్రారంభమైంది. హైదరాబాద్ సారథీ స్టూడియోలో ఒక సినిమా చిత్రీకరణలో వున్న నందమూరి తారకరామారావు సినారెతో ప్రస్తావన చేశారు. అప్పటికే తను రాసిన పాటల్ని ఎన్టీఆర్‌కు వినిపించారు. తొలుత రాసిన పాట 'కలల అలలపై తేలెను'. కాని తొలుత రికార్డయ్యింది "నన్ను దోచుకుందువటె వన్నెల దొరసాని', ఎన్టీఆర్, జమునలపై చిత్రీకరించారు. నాటి నుంచి ఎన్టీఆర్‌తో గీతానుబంధం, గాఢమైన స్నేహానుబంధం. ఎన్టీఆర్ చివరి దశవరకూ అవిచ్ఛిన్నంగా కొనసాగింది.

భారతీయ సాహిత్యంలో అత్యున్నతమైన జ్ఞానపీఠ పురస్కారం 'విశ్వంభర'కు లభించింది. ఆదిమకాలం నుంచి ఆధునిక కాలం దాకా సాగిన మానవ విజయ మహేతిసం విశ్వంభర.

అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి టి. అంజయ్య సినారెను అధికారభాషా సంఘానికి అధ్యక్షునిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా నియమించారు. తర్వాత సాంస్కృతిక మండలి అధ్యక్షులయ్యారు. భాషా సాంస్కృతిక సలహాదారులయ్యారు. కవులు, కళాకారుల తరపున రాష్ట్రపతిచేత రాజ్యసభ సభ్యులుగా నియమితులయ్యారు. కవితారచన కొనసాగిస్తూనే విద్యా సాంస్కృతిక సంస్థల పరిపాలనా పదవులనూ వెలిగించారు సినారె.

ఏడు దశాబ్దాల కవితా సృజనానుభవాన్ని పండించుకున్న మహాకవి. డా. సి.నారాయణరెడ్డి తెలంగాణ బిడ్డ కావడం గర్వకారణం.

- డా॥ జె. చెన్నయ్య
m : 94400 49323

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక

## ప్రచురణలు

చెలిమి అంటే స్నేహం. బడిలో చెలిమి.. ఇంట్లో కలిమి... బాల చెలిమి... చదువు కోడానికి పాఠ్య పుస్తకాలు మినహా ఇతర బాల సాహిత్యం అందుబాటులో లేని విద్యార్థుల్లో లోకజ్ఞానం పెంచి, రోజు రోజుకు విస్తరిస్తున్న ప్రపంచ జ్ఞానాన్ని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు కూడా ఎప్పటికప్పుడు అందించి వారిని ఎవరికీ తీసిపోని విధంగా తయారు చేసే లక్ష్యంతో ప్రారంభమైన బాలల వికాస పత్రిక 'బాలచెలిమి'.



చందదారులుగా చేరండి! **బాలచెలిమి** చందదారులను చేర్పించండి!

'యం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా : BALA CHELIMI**
"BHOOPATHI SADAN" 3-6-716, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029.Mob: 9030626288,
Email:desk.chelimi@gmail.com, www.balachelimi.com

**చందా వివరాలు :**
విడి ప్రతి : రూ. 40, వార్షిక చందా : రూ. 400,
2 సం॥లకు : రూ. 750
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందా మొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**
Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

### తెలంగాణ బడి పిల్లల కథలు



10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300

### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300

### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication - 30th December, 2024
Postal Dates: 24th & 26th Every Month

RNI Regn. No. 52828/1992 TC No. TEL Tel01232
Postal Regn.No.HCD-5022/2024-2026




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com